
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY

నల్లగొండ
5
మంగళవారం 17 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.5
కనిష్ఠం	24.8


తక్కువ ధరకే బంగారం
ఇస్తామని మోసం
● ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



6

స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రాజకీయవర్గాల్లో ఒక్కసారిగా సందడి మొదలైంది. బీసీ రిజర్వేషన్ల విషయాన్ని ప్రభుత్వం తేల్చితే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏ సమయంలోనైనా షెడ్యూల్ విడుదలచేసే అవకాశం ఉండటంతో అధికారులు సైతం సిద్ధంగా ఉన్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

స్థానికంపై .. ముందుకు!



» రిజర్వేషన్ల కోటాపై ప్రభుత్వ విధాన నిర్ణయం పెండింగ్
» రిజర్వేషన్ల అనంతరం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్న నాయకులు
» పరిషత్, పంచాయతీ ఎన్నికలకు వారంలో షెడ్యూల్ వస్తుందని చర్చ


గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు పాలకవర్గాల గడువు ముగిశాక సకాలంలో ఎన్నికలు నిర్వహించలేకపోవడంతో ప్రస్తుతం అవన్నీ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, వాటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం జతచేయాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో పల్లెలు, పట్టణాల్లో ఎక్కడి పనులక్కడే నిలిచిపోవడంతోపాటు పాలన గాడితప్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో దాన్ని తక్షణం అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంఘాలు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తోంది. దీంతో ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. వార్డు మొదలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం వరకు ఏ స్థానం, ఏ కేటగిరీకి కేటాయిస్తారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అధికారిక రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండడానికి ఆస్కారం లేకపోవడంతో, తాజా కులగణన నివేదిక ప్రకారం రిజర్వేషన్ల అమలులో భాగంగా బీసీలకు తమ పార్టీ నుంచి 42శాతం సీట్లు కేటాయిస్తామని, జనరల్ స్థానాల్లో బీసీలకు ప్రాధాన్యం పెంచుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయి నాయకుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

ఎప్పుడైనా షెడ్యూల్ వచ్చే అంచనాలో అధికార యంత్రాంగం

పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న సంకేతాలతో అధికారయంత్రాంగం, పోటీ చేయాలనుకునే ఆశావహులు అప్రమత్తమయ్యారు. ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత కలుపుకొని మొత్తం 73 మండలాల్లో 73 జడ్పీటీసీ స్థానాలు, 1,730 గ్రామపంచాయతీలు, సుమారు 17,500కుపైగా వార్డు స్థానాలు, 722 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పోలింగ్, పోలీస్..

- మిగతా 7వ పేజీలో...

సత్తా చాటాలి



» వ్యూహాలు రచిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం
» స్థానిక ఎన్నికల్లో మండల, జిల్లా కమిటీలదే కీలక పాత్ర
» నెలాఖరులోగా కమిటీల నియామకానికి కసరత్తు
» క్షేత్రస్థాయిలో కష్టపడేవారికే ప్రాధాన్యం

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండగా, ప్రధాన రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని సన్నద్ధమవుతున్నాయి. ప్రధానంగా అధికార పార్టీ కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుండటంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ఏఐసీసీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది.
- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. ఏఐసీసీ పెద్దలు, మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యేలు, పార్టీలోని సీనియర్ నేతలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. పార్టీపరంగా ఎక్కడా నేతల మధ్య సమన్వయంలోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధిష్ఠానం ఇప్పటికే టీపీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించి, జిల్లాల్లోని సీనియర్ నేతలకు అందులో అవకాశం కల్పించింది. పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు రాష్ట్ర, జిల్లా, మండల నేతలంతా కృషి చేయాలని సూచించింది. అందుకు వీలైనంతా త్వరగా మండల కమిటీల ఏర్పాటు పూర్తిచేయాలని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ నాయకులకు సూచించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో మండల, జిల్లా కమిటీలే కీలక పాత్ర పోషిస్తాయని, నెలాఖరు నాటికి మండల అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. మండల అధ్యక్షుల పదవులకు ఈనెల 17వరకు నేతల పేర్లు సేకరించి, ప్రతి మండలం నుంచి ఐదుగురితో కూడిన జాబితా అందజేయాలని డీసీసీ అధ్యక్షులను కోరారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులతో మీనాక్షి నటరాజన్‌జూమ్ మీటింగ్ సైతం నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిపై చర్చించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న మండల నేతల జాబితాలు అందజేయాలని డీసీసీ అధ్యక్షులకు సూచించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు మంగళవారం ఉమ్మడి జిల్లా నుంచి మండల అధ్యక్షుల ఎన్నికకు ప్రదిపాదిత జాబితాలు పంపేందుకు నాయకులు కసరత్తు పూర్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేలతో చర్చించి, అర్హులైన వారి జాబితాలు సిద్ధం చేశారు.

కష్టపడేవారికే అవకాశం...

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ సారి ఎవరికి పడితే వారికి సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యం ఇస్తామని ఏఐసీసీ స్పష్టం చేసింది. పార్టీని నమ్ముకుని, స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నవారికే సర్పంచ్, వార్డు సభ్యులు, ఎం పీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ కౌన్సిలర్లుగా అవకాశం కల్పిస్తామని ప్రకటించింది. మరోవైపు ఏఐసీసీ పెద్దలు స్థానిక సంస్థల..

- మిగతా 7వ పేజీలో...

రైతు భరోసా షురూ

» సోమవారం సాయంత్రం నుంచే జమ
» నల్లగొండ జిల్లాకు రైతుభరోసా నిధులు రూ.411కోట్లు
» రెండో విడతలో రూ.327కోట్లకు పైగా జమచేయనున్న ప్రభుత్వం
» సాగు చేసే భూమి అంతటికీ పెట్టుబడి సాయం



నల్లగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా నిధులను విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలో మొదటి విడతగా సోమవారం సాయంత్రం 4,36,994 మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు రూ.411,34,37,747 విడుదల చేసింది. ఈ నిధులు సోమవారం సాయంత్రం నుంచే జమకావడం ప్రారంభమైందని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తం 5,65,803 మంది రైతుల...

- మిగతా 6వ పేజీలో...

మూసీ రోడ్డుకు మోక్షమెప్పుడో?

» శంకుస్థాపన చేసి రెండేళ్లు » ఇప్పటికీ ప్రారంభంకాని పనులు » సందర్శకులు, ప్రాజెక్టు సిబ్బందికి తప్పని ఇబ్బందులు


బొప్పారం శివారులో మూసీ కుడి కాల్వ కట్టపై గుంతలమయమైన రహదారి

కేతేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, సూర్యాపేట జిల్లా సరిహద్దుల్లో గల మూసీ ప్రాజెక్టు వద్దకు వెళ్లే కేతేపల్లి ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. ఈ రహదారి ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. మూసీ ప్రాజెక్టును సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు, పరిసర గ్రామాల ప్రజలు, మూసీ ప్రాజెక్టు దిగువన ఉన్న బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేతేపల్లిలోని 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి మూసీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ వెంట కొత్తపేట, కాసనగోడు, బొప్పారం గ్రామాల మీదుగా ప్రాజెక్టు వరకు గల 13కిలో మీటర్ల రహదారి మట్టిరోడ్డుగా ఉండేది. వర్షాకాలంలో నడవడానికి కూడా వీలులేకుండా ఉండేది. దశాబ్దం క్రితం కేతేపల్లిలోని 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి కాసనగోడు గ్రామ శివారు వరకు సుమారు 10కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి మూసీ ప్రాజెక్టు వరకు మరో మూడు కిలో మీటర్లకు పైగా రోడ్డును అలాగే వదిలేశారు. ఇప్పటి వరకు ఆ రోడ్డు మరమ్మతులకు నోచడం లేదు. కేతేపల్లి నుంచి కాసనగోడు గ్రామ శివారు వరకు దశాబ్దకాలం క్రితం నిర్మించిన బీటీ రోడ్డు కూడా ధ్వంసమైంది. అంతంతమాత్రంగా ఉన్న ఈ రహదారిపై మూసీ కుడి ప్రధాన కాల్వ పనుల నిర్వహణలో భాగంగా మూడేళ్ల క్రితం తిరిగిన యంత్రాలు, వాహనాల ధాటికి రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయమైంది.

కాల్వ కట్టే రోడ్డు

కాసనగోడు గ్రామం నుంచి మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డు లేకపోవడంతో మూసీ కుడి ప్రధాన కాల్వ కట్టపై నుంచే ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. కాసనగోడు, బొప్పారం గ్రామాలకు చెందిన రైతులు మూసీ ప్రాజెక్టు సమీపంలోని వ్యవసాయ భూములకు వెళ్లాలంటే ఈ కట్టపై నుంచే వెళ్లాలి. ధాన్యాన్ని ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇళ్లకు తరలించేందుకు ఈ గుంతల దారితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరదలు వచ్చి మూసీ ప్రాజెక్టు పొంగిపొర్లే సమయంలో మండల కేంద్రం కేతేపల్లి నుంచి

- మిగతా 8వ పేజీలో...

రైతుల భవిష్యత్తు దిశగా 'రైతు నేస్తం'


చింతపల్లి మండలం నెల్వలపల్లిలో మహిళా రైతుతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతుల భవిష్యత్తు దిశగా రైతునేస్తం కార్యక్రమం ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'రైతునేస్తం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.

నసర్లపల్లి గ్రామ మహిళా రైతుతో మాట్లాడిన సీఎం..

మండలంలోని నసర్లపల్లి గ్రామ మహిళా రైతు బిక్కని రాణిమ్మ సీఎం రేవంత్‌రెడ్డితో ముఖాముఖి మాట్లాడింది. నాలుగు ఎకరాల పొలం ఉందని సన్న వడ్లు వేశామని ఎనిమిది పుట్లు పండిందని ముఖ్యమంత్రితో సంభాషించారు. ప్రభుత్వం నుంచి రూ.1,80,000 రుణమాఫీతో పాటు బోనస్ కింద రూ.15,000 జమ అయ్యాయని,దీంతో పాటు ప్రభుత్వం రూ.17100 రైతు భరోసా మంజూరు చేసిందని ఆమె తెలిపారు. తనకు ఇద్దరు అమ్మాయిలు ఒకరు 10 తరగతి, మరొకరు ఇంటర్‌మీడియట్ చదువుతున్నట్లు ఆమ చెప్పడంతో వారి ఉన్నత చదువుల కోసం కృషిచేసి బంగారు భవిష్యత్తు కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, ఏవో శ్రవణికుమారి, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, మాల్ మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలుసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవానిపవన్‌కుమార్ ఉన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: 'ప్రజావాణి' దరఖాస్తులు పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 'ప్రజావాణి'లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మాత్రమే కాకుండా, గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆయా, ఆశ వర్కర్ల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహార పంపిణీ, గర్భిణులకు నిరంతర పరీక్షలు, చికిత్స , తదితర అంశాలను చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. త్వరలోనే రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష నిర్వహించనున్నందున సంబంధిత అధికారులు సమాచారంతో సమీక్షకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో 2024 సంవత్సరంలో విడతల వారీగా రుణమాఫీ పొందిన రైతుల వివరాలను ఆయా గ్రామపంచాయతీల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నల్లగొండ కల్చరల్: జిల్లాకేంద్రంలో ఈనెల 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాల'ని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, పతంజలి యోగా సమితి అధ్యక్షుడు నాగులపల్లి శ్యాంసుందర్, యోగా గురువులు కరుణాకర్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్


గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి కృషిచేయాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసు కున్నారు. పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. వారి నుంచి వినతులు స్వీకరించి సంబంధిత క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ఇంటి కోసం మహిళ ఒంటరి పోరాటం

త్రిపురారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తనకు ఇందిరమ్మ ఇంటిని ఇవ్వకపోతే కదిలేది లేదని పంచాయతీ కార్యాలయం ఎదుట ఓ మహిళ భీష్మించుకుకూర్చుంది. సోమవారం రాత్రి త్రిపురారం మండలం కంపసాగర్ ఆవాస పరిధిలోని కోమటిగూడెంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... కోమటిగూడెం గ్రామానికి చెందిన మాతంగి సైదమ్మకు నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టిన అనంతరం సుమారు 15 సంవత్సరాల క్రితం ఆమెను, పిల్లలను తల్లిగారింటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. సైదమ్మ కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. ఆమె ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకోగా, జాబితాలో పేరు కూడా వచ్చింది. చివరికి మంజూరు పత్రాలు రాలేదు. కంపాసాగర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న సైదమ్మ పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా అప్పటికే అధికారులు వెళ్లిపోయారు. దీంతో ఆమె సాయంత్రం 5 గంటల పంచాయతీ కార్యాలయం ఎదుట నుంచి కదలనని భీష్మించుకు కూర్చుంది. రాత్రి 11 సమయంలోనూ అక్కడే నిద్రించింది.

ప్రథమంలో బాలికలు, ద్వితీయంలో బాలుర పైచేయి

నల్లగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో బాలికలు, ద్వితీయ సంవత్సరంలో బాలురు పైచేయి సాధించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదలచేసింది. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 7,617మంది విద్యార్థులకు 5,196మంది (68.22శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు 3,728మందికి 2,347మంది(62.96శాతం) ఉత్తీర్ణత సాధించగా, బాలికల విభాగంలో 3,889 మందికి 2,849మంది(73.26శాతం) ఉత్తీరులయ్యారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 925మందికి 641మంది(69.3శాతం) ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 635మందికి 420మంది (66.14శాతం) ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 290మందికి 221మంది (76.21శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో మొత్తం 3,771మందికి 2,537మంది(67.28 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 2,207మందికి 1,495మంది (67.74) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 1,564మందికి 1,042మంది (66.62శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో ద్వితీయ సంవత్సరంలో 657మందికి 402మంది (61.19శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు 529మందికి 330మంది(62.38శాతం) ఉత్తీర్ణులు కాగా, బాలికలు 128మందికి గాను 72మంది (56.25శాతం) ఉత్తీర్ణత సాధించారు.

డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

డీఐవో డాక్టర్ పద్మ


సమావేశంలో మాట్లాడుతున్న డీఐవో డాక్టర్ పద్మ

నల్లగొండ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ పద్మ అన్నారు. సోమవారం పానగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న పిల్లలలో డయేరియా సమస్య వచ్చే అవకాశాలు ఉందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలున్న ప్రతీ ఇంటికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్, జింక్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు వీటి వినియోగంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా అంతటా ఈ కార్యక్రమం ఉంటుందని, వైద్యాధికారులు సిబ్బంది ఈ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఓఆర్‌ఎస్ వినియోగం గురించి వివరించారు. ఒక ప్యాకెట్‌ను లీటర్ తాగునీటిలో కలిపి నీళ్ల విరేచనాలు ఉన్న పిల్లలకి తాగించాలని, కేవలం ఒక్కరోజు మాత్రమే తెరిచిన ప్యాకెట్‌ను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి డాక్టర్ జి.తిరుపతిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిల్ప, కృష్ణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రండి.. చూడండి.. పాఠశాలలో చేర్పించండి



కోదాడ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో కార్పొరేట్ రంగానికి దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య అందిస్తున్నాం, పాఠశాలకు రండి, వసతులు పరిశీలించి, విద్యార్థులను చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ఉపాధ్యాయ బృందం ఊరు వాడల్లో కరపత్రం, ఫ్లెక్సీ, వాయిస్ రికార్డు, ఆటోతో ఓ బృందం, బైకులు మరో ఉపాధ్యాయ బృందం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం, అశోక్‌నగర్, లక్ష్మీపురం గ్రామాల్లో పర్యటించి విద్యార్థులను, తల్లిదండ్రులను కలుస్తున్నారు. పాఠశాలలోని సౌకర్యాలు, ఫలితాలను తెలియజేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పించాలని కోరుతున్నారు. సోమవారం నిర్వహించిన బడిబాటో ఉపాధ్యాయులు దేవరాజు, బ్రహ్మానందం, ఖాజామియా, జానకిరామ్, చిన్నప్ప, అశోక్‌గౌడ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాయిగూడెం పురామానవుల ఆవాసమే


సాయిగూడెం గడీల నుంచి సేకరించిన మట్టి పరికరాలను చూపిస్తున్న కుండె గణేష్

ఆలేరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని సాయిగూడెం గ్రామం ఒకప్పుడు పురామానవుల ఆవాసమేనని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా ప్రధానకార్యదర్శి కుండె గణేష్ అన్నారు. సోమవారం ఆయన సాయిగూడెంలో కూలిన గడిని పరిశీలించారు. ఈ గోడల నిర్మాణానికి వాడిన మన్ను పాటిగడ్డ నుంచి తవ్వి తెచ్చిందేనన్నారు. అందుకే గోడల నిండా కుండ పెంకులు, రాతి ముక్కలు, ఎర్రకోట బొమ్మ ముక్కలు కనిపిస్తున్నాయన్నారు. గడి గోడల పురావస్తువుల్లో అగెట్ రాతిముక్క, శాతవాహన కాలపు టెర్రకోట చిలుము ముక్క, విరిగిన సూక్ష్మ రాతియుగపు పనిముట్టు(మైక్రోలిత్) ఉన్నాయన్నారు. రాతి ముక్క కాలం కోట్ల ఏళ్లు ఉంటుందని, టెర్రకోట చిలుముకు 2వేల ఏళ్లు ఉంటుందన్నారు. సూక్ష్మరాతి యుగపు పనిముట్టు 10వేల ఏళ్ల నాటిదన్నారు. సాయిగూడెంలోని మల్లన్న గుట్ట చరిత్ర పూర్వయుగం ఆనవాళ్లు ఉన్న తావు, ఆలేరు వాగు, ఈదులవాగు దారిలో పాత రాతియుగం ఆనవాళ్లు లభించాయని నాగభూషన్‌రావు అనే ఆర్కియాలజిస్ట్ తన పీహెచ్‌డీ పరిశోధన గ్రంథం 'స్టోన్ ఏజ్ కల్చర్స్ ఇన్ నల్లగొండ'లో రాశారని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు

ఆరోగ్యశ్రీలోకి 'వయోవందనం'

» రూ.5 లక్షల వరకు ఉచిత సేవలు » ఉద్యోగ విరమణ చేసిన 70 ఏళ్ల పైబడిన వృద్ధులకు అవకాశం



ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆరోగ్యశ్రీ సేవలు చేరువకానున్నాయి. 70 ఏళ్లకు పైబడిన వారికి ఆరోగ్యశ్రీలో అర్హత లేక ఇబ్బంది పడేవారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కిందికి తీసుకువచ్చిన వయోవందన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ హెల్త్‌ట్రస్ట్‌లో చేర్చిం ది. ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 70 ఏళ్లకు పైబడిన వారికి ఆరోగ్యశ్రీకి సంబంధించిన ఆసుపత్రుల్లో రూ.5లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందనున్నాయి. ముఖ్యంగా 70 సంవత్సరాల పైబడిన దారిద్ర్యరేఖకు పైబడిన ఆర్థిక స్థోమతకు సంబంధం లేకుండా ఈ పథకం వర్తింపుకానుంది. ఇది ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వయోవృద్ధులకు వరంగా మారనుంది. ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైర్డ్ అయిన వారికి కూడా ఇక రూ. 5లక్షల వరకు వైద్యం ఉచితంగా అందనుంది.

– (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

సూర్యాపేట జిల్లాలో 10,99,560 మంది జనాభా ఉంది. ఇందులో 29వేల మంది వరకు 70 ఏళ్లకు పైబడిన వారూ ఉన్నారు. అదేవిధంగా జిల్లాలో 11ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు ఉన్నాయి.సూర్యాపేట జి ల్లా కేంద్రంలో నాలుగు ఆరోగ్యశ్రీ అమలవుతున్న ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో వయోవందన పథకం అమలు కానుంది. అయితే 70ఏళ్లకు పైబడినవారు విధిగా ఆధార్ కార్డు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ పూ ర్తయిన మరుక్షణం కార్డు రూపంలో వివరాలతో కూడిన అర్హత నెంబర్ వస్తుంది. ఈ కార్డు ద్వారా ఆరోగ్యశ్రీలో వయోవందన కింద సేవలు పొందవచ్చు.

నెట్‌వర్క్ చాలా బిజీ

వయోవందన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీలో చేర్చడంతో 70 ఏళ్లకు పైబడిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ బిజీగా ఉండడం లేదా సర్వర్ డౌన్ అవుతుండటంతో దరఖాస్తుకు ఇబ్బందిగా మారింది. ఆధార్ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం ఉత్తర్వులు గత నెల విడుదల చేసినా దానికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతంగా లేదు.దీంతో 70 ఏళ్లకు పైబడిన అర్హులైన వారి ఆశలు ఆవిరవుతున్నాయి. ఇప్పటికైనా ఆన్‌లైన్ ఇబ్బంది లేకుండా చూడాలని వయోవృద్ధులు కోరుతున్నారు.

ఆన్‌లైన్ ఓపెన్‌కాక ఇబ్బంది పడుతున్నాం



రాష్ట్ర ప్రభుత్వం వయోవందన పథకాన్ని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో చేర్చడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమస్య ఉంది. దీనివల్ల రిజిస్ట్రేషన్ కావడంలేదు. దీంతో చాలామంది నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ సమస్య తలెత్తకుండా చూడాలి. ఈ పథకం చాలామందికి ఉపయోగపడుతుంది.

– దండ శ్యాంసుందర్‌రెడ్డి, పెన్షనర్

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

తిరుమలగిరి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామశివారులో సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలం దాట్ల గ్రామానికి చెందిన కాగితం రమేష్, మేనల్లుడు బేతముల రఘువీర్ కలిసి హైదరాబాద్‌లో సుతారు పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నారు. తొండ గ్రామశివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు కింద ఉన్న మట్టి కుప్పలు, రాళ్లపై పడటంతో వెనుక కూర్చున్న కాగితం రమేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న రఘువీర్‌కు తీవ్రగాయాలు కాగా అతడిని ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. రమేష్ కుమారుడు ఉపేందర్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపు తప్పిన వాహనం : ముగ్గురికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన వెంకట్, విష్ణు, సుధీర్ మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో అబ్దుల్‌పూర్‌మెట్ నుంచి పోచంపల్లి వైపు బైక్‌పై వస్తున్నారు. కాగా, ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వెంకట్ నడపడంతో టీఎస్ మోడల్ స్కూల్ వెళ్లే రహదారి మూలమలుపుపై అదుపుతప్పి పక్కనే ఉన్న సూచిక స్తంభాలను ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట్‌కు తీవ్రగాయం కాగా, విష్ణు,సుధీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడ్డ వెంకట్‌ను హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఇదిలా ఉండగా రోజువారీ కూలీగా పనిచేస్తున్న వెంకట్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైస్‌మిల్ డ్రైవర్ మృతి


ప్రసాద్‌గౌడ్(ఫైల్‌ఫొటో)

మద్దిరాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం చందుపట్ల గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో రైస్ మిల్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన జల్లం ప్రసాద్‌గౌడ్(32) చందుపట్ల గ్రామంలోని రైస్ మిల్లులో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం మిల్లులో చుట్టూ ఉన్న గడ్డిని తొలగించాలని యజమాని సూచించడంతో గడ్డి తొలగిస్తున్న క్రమంలో కాలుకు వైరు తగిలి ప్రసాద్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌గౌడ్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. ప్రసాద్‌గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని నాయకులు రామచంద్రయ్య, సోమలింగయ్య, త్యనారాయణ, యోగానందం, నాగలింగం ప్రభుత్వాన్ని కోరారు.

ఊట్కూరులో పాడి గేదె..

శాలిగౌరారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూరులో విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. రైతు దుబ్బాక సైదులుకు చెందిన పాడి గేదె గ్రామశివారులో మేత మేస్తుండగా తెగిన విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, విద్యుత్ శాఖాధికారులు తనను ఆదుకోవాలని రైతు సైదులు కోరారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్

కోదాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సేవిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 1.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ అనిల్‌రెడ్డిలు తెలిపారు. స్థానిక రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతగిరి గ్రామశివారులోని చాకలిగట్టు వద్ద నలుగురు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడి చేసి వారిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 1.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తాము సేవిస్తూ, నలుగురికి విక్రయిస్తూ

అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన కనగాల సతీష్, అనంతగిరి గ్రామానికి చెందిన షేక్ సైదాబాబు, బడేటి వెంకటేష్, చెవుల శ్రీకాంత్ కొంతకాలంగా గంజాయి తీసుకువచ్చి సేవిస్తూ, మరికొంత మందికి విక్రయిస్తున్నారని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగా అనంతగిరి శివారులోని గుట్ట వద్ద గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. కనగాల సతీష్ వద్ద నుంచి కిలో, సైదాబాబు వద్ద 300 గ్రాములు, బడేటి వెంకటేష్ వద్ద 300 గ్రాములు, చెవుల శ్రీకాంత్ 300 గ్రాముల చొప్పున గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నలుగురికి మిర్యాలగూడకు చెందిన భానుప్రకాశ్ గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 8న ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి గంజాయి తీసుకుని బైక్‌పై అనంతగిరిలోని చాకలిగట్టు వద్దకు చేర్చి కిలో గంజాయిని కనగాల సతీష్‌కు రూ.10 వేలకు, మరో ముగ్గురికి 300 గ్రాముల గంజాయిని రూ.3వేల చొప్పున విక్రయించినట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న భానుప్రకాశ్‌పై కూడా కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం భానుప్రకాశ్ పరారీలో ఉన్నాడని, అతడిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. అదేవిధంగా కోదాడ పట్టణ పరిధిలోనూ 500 గ్రాముల గంజాయిని పట్టుకుని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయిని విక్రయించి, సేవించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ మోసం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి, పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, నకిలీ బంగారం బిస్కెట్

● మోసగించిన ఇద్దరి అరెస్టు

నల్లగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామని మోసం చేసిన ఇద్దరిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ. 4లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, అర గ్రాము నకిలీ బంగారం బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.శివరాంరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పెదకాకాని ప్రాంతానికి చెందిన బత్తుల ఏసు మరో మహిళతో కలిసి 2024 సంవత్సరం నవంబరు 8వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలోని మెడికల్ దుకాణానికి వచ్చాడు. తాను ఒంగోలు జిల్లాకు చెందిన వ్యక్తినని, స్థానికంగా బిల్డర్‌గా పనిచేస్తున్నానని దుకాణం యజమాని వేముల రాజుతో పరిచయం చేసుకున్నాడు. తన వద్ద పురాతన బంగారం ఉందని, తక్కువ ధరకు ఇస్తానని బంగారు బిళ్లను చూపించాడు. ఆ బిళ్లను రాజు జ్యుయలరీ దుకాణానికి వెళ్లి పరీక్ష చేయించగా అసలు బంగారమని తేలింది. రెండు రోజుల్లో రూ.5 లక్షలు సర్దితే 22తులాల బంగారం బిస్కెట్లు ఇస్తానని ఏసు చెప్పటంతో అందుకు సమ్మతించిన రాజు రూ.5లక్షలు ఇచ్చాడు. ఏసు ఇచ్చిన బంగారం జ్యుయలరీ దుకాణంలో తనిఖీ చేయించగా నకిలీదని తేలటంతో రాజు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో విచారణ చేస్తుండగా ఏసు ఇటీవల వన్‌టౌన్ పోలీసులకు పట్టుబడ్డాడు. ఆటో నడుపుతూ జీవించే ఏసు అప్పులు చేసి, సులువుగా డబ్బులు సంపాదించాలని తక్కువ ధరకు బంగారం ఇస్తానని మోసం చేస్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. బత్తుల ఏసు గతంలో కుషాయిగూడ, నల్లగొండలో నేరాలకు పాల్పడగా ఆయా కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.

తాకట్టు బంగారం విడిస్తే తక్కువ ధరకు ఇస్తానని

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలానికి చెందిన పల్లె మధూకర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో సేల్స్‌మేనేజర్‌గా పనిచేసి 2023లో మానేశాడు. జల్సాలకు అలవాటుపడి స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోయాడు. ఈ నెల 11న నల్లగొండ వన్‌టౌన్ పరిధిలోని పాతబస్తీలోని జ్యుయలరీ షాపు నిర్వాహకుడు చేపూరి గోపికిషన్ వద్దకు వచ్చాడు. బ్యాంకులో తాను తాకట్టుపెట్టిన బంగారాన్ని విడిపిస్తే అదే బంగారాన్ని తక్కువ ధరకు విక్రయిస్తానని నమ్మించాడు. దీంతో దుకాణం నిర్వహకుడు గోపికిషన్ ప్రకాశంబజార్‌లోని యాక్సిస్ బ్యాంకులో మధూకర్‌రెడ్డికి సంబంధించిన ఖాతాలో రూ.1.20లక్షలు డిపాజిట్ చేశాడు. బంగారం గురించి అడిగితే ఖాతా ఫ్రీజ్ అయిందని, నగదు తర్వాత ఇస్తానని చెప్పటంతో ఈ నెల 13వ తేదీన గోపీకిషన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దర్యాప్తులో భాగంగా నిందితుడు మధూకర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఘట్‌కేసర్, జూబ్లీహిల్స్, మిర్యాలగూడ, నిజామాబాద్ స్టేషన్లలో ఇదేతరహా మోసంపై కేసు నమోదుకాగా జైలుశిక్ష అనంతరం బెయిల్‌పై బయటకువచ్చాడు. అనంతరం విశాఖపట్నం, సిద్దిపేట, ఉప్పల్, నల్లగొండ పరిధిలో మోసాలకు పాల్పడ్డాడు. ఈ వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా లక్ష్మి అనే మరో నిందితురాలు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ శివరాంరెడ్డి వివరించారు. ఈ రెండు కేసులను ఛేదించిన డీఎస్పీ శివరాంరెడ్డి, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు శివ, సైదులు, శంకర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ముందు నుయ్యి.. వెనుక గొయ్యి

● *వరద కాల్వ, వంతెన నిర్మాణం మధ్యలో నిలిచిన లారీ*


కందిబండ శివారులో నిర్మాణంలో ఉన్న వంతెన పైనుంచి ముందుకు వెళ్లి ఆగిన లారీ

వెనుక గొయ్యిని తలపించేలా లారీ నిలిచిన తీరు చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

మేళ్లచెర్వు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వాహనం అతివేగంగా వెళుతూ ముందు ఉన్న గొయ్యిని దాటే సన్నివేశం సినిమాల్లో చూస్తుంటాం.. ఆదివారం రాత్రి సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం కందిబండ గ్రామశివారులో అదే తరహా సంఘటన జరిగింది. ఈఘటనలో లారీడ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కందిబండ గ్రామ శివారులో వంతెన నిర్మాణంలో ఉన్నందున వాహనాల రాకపోకలకు తాత్కాలికంగా ఓ డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. వంతెన నిర్మాణంలో భాగంగా వరద కాల్వ కోసం 10అడుగుల వెడల్పు, 50 అడుగుల లోతులో తవ్వారు. మేళ్లచెర్వు నుంచి సిమెంట్ లోడుతో ఓ లారీ కోదాడ వైపు వెళుతోంది. వంతెన పక్కన డైవర్షన్ రోడ్డును గమనించని డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడుపుతూ వరద కాల్వ కోసం తవ్విన 10అడుగుల వెడల్పున ఉన్న గోతిని దాటి ముందుకు వెళ్లి వరద కాల్వకు, వంతెన నిర్మాణానికి మధ్యలో నిలిచింది. ఈ ఘటనలో వాహనం ముందు చక్రాలతో పాటు డీజిల్ ట్యాంక్, కమాన్ కట్టలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంత ప్రమాదం జరిగినా లారీ డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. ముందు నుయ్యి..

నిందితులను తేల్చేందుకు హైలెవల్ కమిటీ

● **పాత కమిటీని రద్దు చేసిన ఈవో**

● **అడిషనల్ కమిషనర్ నేతృత్వంలో మరో నలుగురితో హైలెవల్ కమిటీ**

● **చింతపండు చోరీపై విచారణ ప్రారంభించిన కమిటీ**

యాదగిరిగుట్ట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహ స్వామివారి సన్నిధిలో మే 28న వెలుగుచూసిన చింతపండు దొంగతనం దోషులను తేల్చేందుకు మరో కమిటీ ఏర్పాటైంది. దొంగలను పట్టుకునేందుకు మొదట డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, పర్యవేక్షకులు ముద్దసాని నరేష్, దాసోజు నరేష్, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే.శేషగిరిరావులతో కూడిన కమిటీ నియమించారు. పారదర్శకంగా విచారణ జరగదనే ఫిర్యాదులతో ఈవో వెంకట్రావు కమిటీని రద్దుచేశారు. అయితే కేసును పునర్విచారణ చేసేందుకు దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు నేతృత్వంలో రీజనల్ అదనపు కమిషనర్ (ఆర్జేసీ) వినోద్‌రెడ్డి, నల్లగొండ, రంగారెడ్డి, సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్లు భాస్కర్, ఆకునూరి చంద్రశేఖర్, సంధ్యారాణితో కూడిన హైలెవల్ కమిటీ ఏర్పాటు ఏర్పాటు చేశారు. సోమవారం ఈ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు.

విచారిస్తూ, రికార్డులు చూస్తూ

కొండపైకి ఉదయం చేరుకున్న హైలెవల్ కమిటీ సభ్యులు ముందుగా ప్రధాన కార్యాలయంలో ప్రసాదాల విభాగం అధికారులు ఏఈవో గజ్వేల్లి రఘు, పర్యవేక్షకుడు సత్యనారాయణశర్మ, ప్రిపరేషన్ ఇన్‌చార్జి(సీనియర్ అసిస్టెంట్) పులేపాక నవీన్, వంటస్వాములు సంతోష్‌చార్యులు, క్రిష్ణమాచార్యులును పిలిపించి రికార్డులను తనిఖీ చేసింది. దొంగతనం జరిగిన రోజున స్టాక్ ఎంత ఉండాలి? ఎంత ఉంది? చింతపండు బస్తాలను ఎక్కడ భద్రపర్చారు? ఎక్కడి నుంచి తరలించారు? వంటస్వాములు ఎన్నిగంటలకు వస్తారు? ఎన్ని గంటల వెళ్లిపోతారు? దొంగతనానికి పాల్పడి వారితో ఎవరికైనా సంబంధం ఉందా? లేక మీ ప్రమేయం ఉందా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. అదేవిధంగా ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ యాదగిరిని కూడా కమిటీ ప్రశ్నించి దొంగతనం జరిగిన విధానంపై ఆరా తీశారు. వీటితో పాటు సీసీ కెమెరాలు పనిచేసేది? లేనిది? ఆరా తీసింది.

ప్రసాదాల తయారీ కేంద్రం సందర్శన

భోజన విరామం తర్వాత కమిటీ సభ్యులు దొంగతనం జరిగిన ప్రదేశానికి చేరుకున్నారు. దొంగతనానికి వినియోగించిన కారు పార్క్ చేసిన చోటకు చేరుకొని ఎస్పీఎఫ్ సిబ్బంది నుంచి సమాచారం సేకరించారు. తర్వాత కన్వేయర్ బెల్ట్ వద్దకు(శివాలయం ఎదురుగా) చేరుకొని పరిసరాలను పరిశీలించారు. అక్కడి నుంచి ప్రసాదాల తయారీ కేంద్రం లోనికి చేరుకునే ముందు విక్రయశాల ముఖ ద్వారం, లోపల అల్యూమినియంతో చేసిన తలుపులు, వాటికి బిగించిన జాలీని పరిశీలించగా దొంగతనం చేసేందుకు అనువుగా ఉందని సభ్యులు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ప్రసాదాల విక్రయశాలను పూర్తిగా అల్యూమినియంతోనే తయారుచేసినట్లు కమిటీ దృష్టికి వచ్చింది. తయారీ కేంద్రం లోపల కన్వేయర్ బెల్ట్ వద్ద పరిశీలిస్తుండగా బెల్ట్‌కు (చతుర్ప్రాకారంలో ఏర్పాటు చేసిన) తలుపుకు ఎడమ పక్కన రెండు షీట్లు ఊడిపోయాయి. షీట్లు ఊడిపోయిన విషయం అధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు ప్రిపరేషన్ ఇన్‌చార్జి తెలిపారు. రాత్రి 8 గంటల వరకు విచారణ సాగింది. హైలెవల్ కమిటీ మంగళవారం తన నివేదికను తయారు చేసి బుధవారం దేవాదాయ కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలుస్తోంది. విచారణ సమయంలో డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, ఎస్‌ఐ సీతారాములు ఉన్నారు.

సెల్‌ఫోన్ దొంగ పోలీసులకు అప్పగింత

మోత్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో సోమవారం బస్టాండ్‌లో ఒకేసారి ఇద్దరు వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్లు కొట్టేసిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మోత్కూరు పట్టణానికి చెందిన సురిగల దశరథ, కప్పె యాకయ్య సోమవారం హైదరాబాద్ వెళ్లేందుకు మోత్కూరు బస్టాండ్‌లో బస్ ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తి వారి జేబుల్లోంచి సెల్‌ఫోన్లు కొట్టేశాడు. ప్రయాణికుల రద్దీ ఉండగా కప్పె యాకయ్య మొదట డోర్ నుంచి లోపలకు వెళ్లి చూసుకునే సరికి అతడి జేబులో సెల్‌ఫోన్ కనిపించలేదు. వెంటనే అతను తన సెల్‌ఫోన్ ఎవరో కొట్టేశారంటూ దిగుతుండగా అప్పుడు డోర్‌లో ఉన్న దశరథ తన ఫోన్ పోయిన విషయాన్ని గమనించి వెతకడం ప్రారంభించాడు. వెంటనే సెల్‌ఫోన్లు కొట్టేసిన వ్యక్తి రెండు ఫోన్లను కిందపడేశాడు. యాకయ్య ఆ సెల్‌పోన్లు తీసుకోగా, దశరథ ఓ వ్యక్తిని అనుమానించాడు. వెంటనే ఆ వ్యక్తి అతడిని నెట్టేసి పరిగెత్తాడు. ఈ తతంగాన్ని గమనిస్తున్న బస్టాండ్ క్యాంటీన్ యజమాని కందుల విక్రాంత్ అతడిని వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై పోలీసులను అడగ్గా విచారణ జరుపుతున్నామన్నారు.

రద్దీ నేపథ్యంలో చోరీలు

ఇదిలా ఉండగా సెల్ ఫోన్ దొంగలు ఒక ముఠాగా ఏర్పడి బస్సులు ఎక్కుతున్నప్పుడు సెల్‌ఫోన్లు కొట్టేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉప్పల్ క్రాస్‌రోడ్డులో మోత్కూరుకు వచ్చే బస్సులు ఎక్కేప్పుడు ప్రయాణికుల రద్దీ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫోన్లు చోరీకి గురవుతున్నాయంటున్నారు. ఉప్పల్ క్రాస్ రోడ్డులో బస్సు ఎక్కుతున్నప్పుడు ఇటీవల తన ఫోన్ ఎవరో కొట్టేశారని సోమవారం నిందితుడిని పట్టుకున్న విక్రాంత్ తెలిపాడు. మోత్కూరులో బస్సు ఎక్కుతున్నప్పుడు ఇటీవల తన ఫోన్ కొట్టేశారని అనిల్ అనే వ్యక్తి తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేశానన్నాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మోత్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో చోరీ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకివచ్చింది. గ్రామానికి చెందిన మన్నె బుచ్చిరాములు కుటుంబ సభ్యులతో ఈ నెల 13న వేరే ఊరికి వెళ్లాడు. శనివారం సాయంత్రం తిరిగి వచ్చినప్పటికీ ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో దాచిన బంగారు, వెండి ఆభరణాలు బ్యాగుతో పాటు కనిపించపోవడాన్ని గుర్తించాడు. 3 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి చోరీకి గురైందని గుర్తించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ నోయల్ రాజు తెలిపారు.

ప్రయాణికురాలికి బ్యాగు అందజేసిన కంట్రోలర్

నార్కట్‌పల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన నగదుతో కూడిన బ్యాగును సదరు మహిళకు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి బస్‌డిపో కంట్రోలర్ అందజేసి తమ బాధ్యతను నిర్వర్తించారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. చిట్యాలకు చెందిన మమత అనే ప్రయాణికురాలు సూర్యాపేట డిపో బస్సులో ఎక్కి హైదరాబాద్ నుంచి చిట్యాలలో దిగి తన వెంట ఉన్న బ్యాగును బస్సులోనే మర్చిపోయింది. కానీ అప్పటికే బస్సు బస్‌స్టేషన్ నుంచి వెళ్లింది. కాగా బస్సులో బ్యాగ్ మర్చిపోయిన విషయాన్ని బస్‌స్టేషన్‌లోనే ఉన్న కార్గో నిర్వాహకుడు పొలిమెర దశరథకు చెప్పగా టికెట్ ఆధారంగా నార్కట్‌పల్లి బస్‌డిపో కంట్రోలర్ పీబీ చారికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. బస్సు రాగానే సదరు ప్రయాణికురాలి బ్యాగును కంట్రోలర్ పీబీచారి స్వాధీనం చేసుకున్నాడు. అదే సమయంలో నార్కట్‌పల్లి బస్‌స్టేషన్‌కు వచ్చిన మమతకు రూ.6,000లతో పాటు మరికొన్ని వస్తువులున్న బ్యాగును అప్పగించారు. దీంతో ఆమె ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది.

గేదె రోగం నయం చేస్తానంటూ బంగారం ఆభరణాలు అపహరణ

సూర్యాపేట క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పాడిగేదె రోగాన్ని తగ్గిస్తామని మూడున్నర తులాల బంగారం ఆభరణాలను అపహరించారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలో సోమవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటలోని సీతారాంపురం గ్రామానికి చెందిన దేవరం పూలమ్మ పాడి గేదెనుమేపుతూ, పాలు విక్రయిస్తూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఇటీవల పాడిగేదె అనారోగ్యం బారినపడింది. నెల కిందట బిక్షాటన చేసే ఓ వ్యక్తి ఆమె ఇంటికి వచ్చి మీ ఇబ్బందులుంటే చెప్పండి, తన వద్ద పరిష్కారం లభిస్తుందని నమ్మబలికాడు. అతడు వెళ్లిన వారం రోజులకు గుర్తుతెలియని మహిళ పూలమ్మ ఇంటికి వచ్చి పాడిగేదె అనారోగ్యం బాగుచేస్తామని, అందుకు పూజలు చేయాల్సి ఉంటుందని చెప్పి వెళ్లిపోయింది. తర్వాత సోమవారం ఉదయం 10గంటలకు గుర్తు తెలియని వ్యక్తి పూలమ్మ ఇంటికి వచ్చి తాను చేసే పూజలు, తన వద్ద ఉన్న నూనెతో పాడి గేదె అనారోగ్యం, మోకాళ్లనొప్పులు పోతాయని నమ్మబలికాడు. అది నమ్మిన పూలమ్మ అతడు చెప్పినట్లు రెండు గిన్నెల్లో బియ్యం తీసుకుని వచ్చింది. ఏవో మంత్రాలు చదివాక పూలమ్మ మెడలోని 3 తులాల బంగారు ఆభరణంతో పాటు చేతికి ఉన్న అరతులం ఉంగరాన్ని గిన్నెలోని బియ్యంలో పెట్టాలని సూచించాడు. అతడు చెప్పినట్లే చేసింది. కాసేపటికి ఇంట్లోకి వెళ్లి దేవుడి పటాల వద్ద దండం పెట్టుకొని రావాలని సూచించాడు. వచ్చాక పూజలు చేసిన బియ్యాన్ని వెంటనే పట్టుకోవద్దని గంట కదిలించాలని సూచించాడు. అనంతరం ఒక నూనె సీసాను పూలమ్మకు ఇచ్చి పాడి గెదె వీపుపైన, పూలమ్మ మోకాళ్లపై రాసుకోవాలని సూచించి వెళ్లిపోయాడు. అతడు వెళ్లిన గంట తర్వాత బాధితురాలు పూలమ్మ బియ్యం గిన్నెను తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు లేవు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పూలమ్మ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సాంకేతిక తోడు మంచిదే

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక(టెక్) ఆధారిత బోధనకు సిద్ధమైంది. సాంకేతికత, ఆధారిత పాఠశాలల కోసం ఎన్‌జీవోల సహకారంతో 1వ తరగతి నుంచి 12వ తరగతి(ఇంటర్) వరకు ఉచితంగా అత్యాధునిక బోధన సేవలు అందించేందుకు విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఐదు వేలకుపైగా ప్రాథమిక పాఠశాలలకు సాంకేతిక విద్యను అందించేందుకు విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. దీనిపై విద్యావేత్తలు, న్యాయవాదులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు తమ అభిప్రాయాలు తెలిపారు.

● ఆంధ్రజ్యోతి, దేవరకొండ

మంచి పరిణామం



ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్య అందించేందుకు తీసుకున్న నిర్ణయం మంచిది. దీంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. గ్రామాల్లో అక్షరభ్యాసత పెరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి. వీడియో ఆధారిత బోధన, కంప్యూటర్ కోడింగ్, పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుంది.

● నెమికంటి గౌరిశంకర్, న్యాయవాది, దేవరకొండ

విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వం ఎన్‌జీవోలతో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో టెక్ బోధన అందించేందుకు తీసుకున్న నిర్ణయం హర్షణీయం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంప్యూటర్, నీట్, జెఈఈ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయం. దీంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయి.

● అంకం చంద్రమౌళి, రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం దేవరకొండ నియోజకవర్గ కార్యదర్శి

నాణ్యమైన విద్య అందించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో టెక్‌బోధన విధానం అమలు చేసేందుకు తీసుకున్న నిర్ణయం సరైనదే. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే మూతపడిన పాఠశాలలను తెరిచి విద్యను అందించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కంప్యూటర్, సాంకేతిక పరిజ్ఞానంతో విద్యను అందించడంతో పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికత (టెక్) ఆధారిత బోధనకు పునాది పడుతుంది.

● గోపిచంద్, విద్యార్థి సంఘం నాయకుడు, దేవరకొండ.

నాణ్యమైన విద్య అందుతుంది



మా ఇద్దరు పిల్లలను కొండమల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నాను. ఇప్పటికే ఉన్నత పాఠశాలలో మంచి విద్యను అందిస్తున్నారు. ప్రభుత్వం టెక్ బోధన అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో మరింత విద్యా బోధన అందనుంది. పేద విద్యార్థులకు కంప్యూటర్‌తోపాటు సాంకేతిక విద్య పూర్తిస్థాయిలో అందుతుంది.

రమావత్ లాలునాయక్, కొండమల్లేపల్లి, నల్లగొండ జిల్లా.

అదనంగా శెల్లా, కనుము



కొండకింద వ్రత మండపంలో వ్రతాల్లో పాల్గొన్న భక్తులు (ఫైల్)

- ప్రస్తుత ధర రూ.800
- అదనంగా శెల్లా, కనుము అందజేత
- పాత ధరపై భక్తుల్లో చర్చ

యాదగిరిగుట్ట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో సత్యదేవుడి వ్రతాలు నిర్వహించడం ప్రత్యేకత. ఇందుకోసం కొండ కింద ఆధ్యాత్మిక వాడల్లో ప్రత్యేకంగా రెండు విశాలమైన హాళ్లు నిర్మించారు. వ్రతాల నిర్వహణకు కావల్సిన వస్తు సామాగ్రిని దేవస్థానమే అందిస్తుండగా ప్రతిరోజూ నాలుగు బృందాలుగా వ్రతాలునిర్వహిస్తారు. ప్రత్యేకంగా కార్తీక మాసంలో ఎనిమిది బృందాలు పూజలు నిర్వహిస్తాయి. ఇక్కడ ఇచ్చే పూజ సామాగ్రితో పాటు శెల్ల(వస్త్రం), కనుము(జాకెట్ ముక్క) పంపిణీ చేసేందుకు సరికొత్త విధానం అమల్లోకి రానుంది.

వ్రత టికెట్టు ధర పెంపుపై చర్చ

ప్రస్తుతం వ్రత టికెట్టు ధర రూ.800 ఉంది. అదనంగా శెల్ల, కనుము అందజేయాలని ఈవో నిర్ణయించడంతో ధర పెంపుపై చర్చ జరుగుతోంది. కానీ, వ్రతాల విభాగానికి ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు. అదనంగా ఇవ్వనున్న శెల్ల, కనుము పూజ సామాగ్రి నేరుగా భక్తులకు అందిస్తా రా? లేక పూజారుల ద్వారా అందజేస్తారా? అనేది చర్చనీయమైంది. వ్రతాల విభాగంలో ఏఈవో, పర్యవేక్షకుడు, 10 మంది పూజారులు, గుమస్తా, ఇద్దరు స్వీపర్లతో పాటు అవుట్ సోర్సింగ్‌లో తొమ్మిది మంది మహిళలు, ముగ్గురు పురుషులతో భక్తులకు సేవలు అందుతున్నాయి. గత నెలలో 6,610 వ్రతాలకు ఆఫ్‌లైన్ ద్వారా 6,345, ఆన్‌లైన్‌లో 220 వ్రతాలు, ఈ నెల 13 వరకు 2,587 వ్రతాలకు ఆఫ్‌లైన్ 2,517, ఆన్‌లైన్ 70 వ్రతాలు జరిగాయి. కాగా, మొత్తం కలిపి 9,197 వ్రతాలు జరిగాయి.

వ్రత పూజకు ఇచ్చే వస్తువులు

రూ.800 టికెట్టుతో ఆరు కొబ్బరికాయలు, 260 గ్రాముల చెక్కర, 250గ్రాముల గోధమరవ్వ,200 గ్రాముల బియ్యం, 21 పోకలు, తమలపాకులు, ఐదు ఖర్జూరలు, 15 గ్రాముల కుంకుమ, పసుపు, 20గ్రాముల బుక్క, 10 గ్రాముల గులాలు, కాజు, కిస్‌మిస్‌లు, దూది, 20/20 తెల్ల వస్త్రం, ఒక కుడుక, 20 గ్రాముల నూనె, ఐదు గ్రాముల తేనె, 50 గ్రాముల నెయ్యి, పంచామృతం, ఒక జాకెట్ ముక్క అందిస్తున్నారు. అదనంగా శెల్ల(వస్త్రం), కనుము(జాకెట్ ముక్క) ఇవ్వనుండడంతో ధర పెంపుపై చర్చ జరుగుతోంది.

శివకేశవులకు విశేష పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్పటిక మూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఖజానాకు వివిధ విభాగాల ద్వారా ఆలయ రూ.42,62,938 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, ఈ నెల 27న ఈప్రోక్యూర్‌మెంట్ సీల్డ్ టెండర్ నిర్వహించనున్నట్లు ఈవో వెంకట్రావు సోమవారం ప్రకటించారు. లీజెస్ విభాగంలో 22, ఒకటి మినీవాల్యూ విభాగం, సివిల్ విభాగం ఆరు టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా మట్టపల్లి లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాలు నిర్వహించారు. తదుపరి కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం గావించారు. పాదప్రక్షాళనం మధుపర్క పూజలు యాథావిధిగా చేపట్టారు. మాంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణల అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రీయ వ్యవసాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించి రైతులు శాస్త్రీయంగా వ్యవసాయం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కొంపెల్లి రైతువేదికలో సోమవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రస్తుతం రైతులు పంటల సాగు చేస్తున్నందున రైతులకు వెంటనే రైతుభరోసా వారి ఖాతాలో జమ చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పద్మజ, కొంపెల్లి ఏఈవో యాదగిరి, వహీద్, లాలయ్య, కోటేశ్వరరావు, అల్ల రాజు వీరమల్ల యాదయ్య వీరమల్ల వెంకట్ రాములు, ఎడ్ల రామలింగయ్య, శ్యామల, సుజాత, లక్ష్మి, వెంకటమ్మ, సురిగి చలపతి పాల్గొన్నారు.

22న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు

నల్లగొండ కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చెస్ ఛాంపియన్ దివంగత మేకల అభినవ్ 35వ జయంతిని సందర్భంగా ఈ నెల 22వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కె. కరుణాకర్‌రెడ్డి, ఆర్బిటర్ మేడం విశ్వప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో అండర్ -7, -9, -11,-13,- 15 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 50 మంది విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఉంటుందని తెలిపారు. వివరాలకు కోసం సెల్ : 9985423823లో సంప్రదించాలని వారు కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న టీడీపీ నేతలు కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని టీడీపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, పరిశీలకుడు తుమ్మల మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం దిశగా పని చేయాలన్నారు. అనంతరం నల్లగొండ పట్టణ అధ్యక్షుడిగా గుండు వెంకటేశ్వర్లు, నల్లగొండ మండల అధ్యక్షుడిగా బక్కతోళ్ల ఇస్తారి, కనగల్ మండల అధ్యక్షుడిగా అరెళ్ల కొండల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు జంపాల చంద్రశేఖర్, తేలన్న రవి, పాలడుగు నాగరాజు, దొంతినేని నర్సింహారావు, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలు నాణ్యమైన విద్య అందించాలి

● ఎంజీయూ ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజీయూ ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పీజీ కళాశాలలు నాణ్యమైన విద్య అందించాలని ఎంజీయూ ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడారు. 75శాతం హాజరు నియమాన్ని విధిగా పాటించాలన్నారు. బయోమెట్రిక్ విధానం సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు లైబ్రరీ, పరిశోధన సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ వై. ప్రశాంతి, డిప్యూటీ డైరెక్టర్ జయంతి, వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లు ఉన్నారు.

మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

దేవరకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తెలుగుపల్లిలో మూడు క్వింటాళ్ల రేషన్ సన్నబియ్యాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... చందంపేట మండలానికి చెందిన శ్రీనివాస్ తెలుగుపల్లిలో వినియోగదారుల వద్ద బియ్యాన్ని కొనుగోలు చేసి ఒక ఇంట్లో నిల్వ ఉంచాడు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

దళిత, గిరిజన చట్టాలను బలోపేతం చేయాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనులకు భద్రత కల్పించేలా చట్టాలను బలోపేతం చేయాలని కోరుతూ ఎస్సీ కమిషన్ నేషనల్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌కు సోషల్ వర్కర్ డాక్టర్ ఆనంద్ ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అఘాయిత్యాలను అరికట్టేందుకు అట్రాసిటీ, వేధింపు తదితర చట్టాలను సవరించడంతో పాటు నూతన చట్టాలు రూపొందించాల్సిన అవసరం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

చెన్నకేశవులు త్యాగం వెలకట్టలేనిది

నిడమనూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుడు ఉన్నం చెన్నకేశవులు త్యాగం వెలకట్టలేనిదని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రొబేషనరీ ఎస్ఐ నాగేందర్ అన్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరుకు చెందిన పోలీస్ అమరుడు చెన్నకేశవులు 22వ వర్ధంతిని మండలకేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పోలీసు విధి నిర్వహణలో ఉన్న చెన్నకేశవులు 2013లో మేళ్లచెరువు మండలం నెమలిపురి వద్ద నక్సల్స్ పేల్చిన మందుపాతరలో అమరుడయ్యాడని తెలిపారు. చెన్నకేశవులు జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు కోడిరెక్క జోజి, చిలుకూరి రమేష్, ఏజీపీ ఉన్నం చినవీరయ్య, బొల్లం శ్రీనివాస్, చెన్నకేశవ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఉన్నం ఈశ్వర్, ఉషాకిరణ్, ఎదుళ్ల వినీల్‌రెడ్డి, విజయ్‌భాస్కర్, రిబ్కా, రాజు, షహీద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

'రైతు భరోసా' షురూ

(5వ పేజీ తరువాయి)

బ్యాంకు ఖాతాలకు రూ.738,67,60,000లకు పైగా నిధులను కేటాయించింది. మొదటి విడతగా రూ.411కోట్లకు పైగా విడుదల చేయగా, రెండో విడతలో రూ.327కోట్లకు పైగా నిధులు విడుదల కానున్నాయి. వచ్చే తొమ్మిది రోజుల్లో పూర్తిస్థాయిలో రైతుభరోసా నిధులు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. రైతుభరోసాను ఎలా ముందుకు తీసుకెళ్తారో వివరించారు. సాగుచేసే భూమి అంతటికీ రైతుభరోసాను చెల్లిస్తామని ప్రకటించారు. వాస్తవానికి ఒకేసారి రైతులందరికీ రైతుభరోసా చెల్లించాలని నిర్ణయించగా, నిధులను బట్టి తొమ్మిది రోజుల్లో చెల్లింపులు మొత్తం పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. గత యాసంగి సీజన్‌లో కేవలం నాలుగు ఎకరాలకు మాత్రమే రైతుభరోసాను చెల్లించిన ప్రభుత్వం ఈసారి మాత్రం ఎంత భూమి ఉన్నా ఆ మేరకు రైతుభరోసా సాయం అందించనుంది. అయితే సాగు చేసే భూమి అయితేనే నగదు అందుతుంది. ఇప్పటికే భూభారతి పోర్టల్ ఆధారంగా సాగుచేసే భూమి వివరాలను సేకరించిన ప్రభుత్వం గుట్టలు, వెంచర్లు, ఇతర సాగులో లేని భూములకు పెట్టుబడి సాయాన్ని నిలిపివేసింది.

యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో..

సూర్యాపేట జిల్లాలో 3,06,619 రైతుల భూఖాతాలు ఉండగా, మొత్తం 3,73,175 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ భూమి అంతటికీ ఎకరాకు రూ.6వేల చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రారంభమైంది. యాదాద్రి జిల్లాలో 2,83,872 రైతుల ఖాతాలు ఉండగా, 3,39,332 ఎకరాల సాగుభూమి ఉంది. యాదాద్రి జిల్లాలో కూడా రైతుభరోసా నిధులు జమ చేయడం ప్రారంభించారు. వానాకాలం సీజన్ ప్రారంభంలోనే నిధులు జమవుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఈ ప్రక్రియ మొత్తాన్ని తొమ్మిది రోజుల్లో ప్రభుత్వం పూర్తి చేయనుండటంతో వానాకాలం సాగుకు ఇబ్బందులు తప్పుతాయని రైతులు భావిస్తున్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు రైతుభరోసా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతుభరోసా నగదు తొమ్మిది అర్హులైన ప్రతీ రైతుకు అందుతుంది. సోమవారం సాయంత్రం నుంచే రైతుభరోసా నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకావడం ప్రారంభమైంది. వ్యవసాయాన్ని పండుగగా మార్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద మొత్తంలో చేపడుతోంది. అందులో భాగంగానే పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేస్తోంది. ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుభరోసా నిధులు జమ అవుతున్నాయి. ప్రతీ రైతు పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. త్వరలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు పనిముట్లు అందజేస్తాం.

● పి. శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ.

స్థానికంపై ముందుకు!



(5వ పేజీ తరువాయి)

సిబ్బంది నియామకానికి ఎంతమంది అవసరమవుతారనే అంశంలో ఇప్పటికే ప్రాథమికంగా సమాచారం సిద్ధం చేశారు. పరిషత్‌లకు పార్టీల ప్రాతిపదికన, గ్రామపంచాయతీలకు, వార్డు సభ్యులకు పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉండడంతో, అందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, గుర్తులను ఇప్పటికే సిద్ధం చేశారు. రిజర్వేషన్లను ఎలాఖరారు చేయాలనే అంశంపై ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకున్న మేరకు రిజర్వేషన్ల కోటా, కేటాయింపులు చేస్తారు. ముందుగా పరిషత్‌లకు, తదుపరి పక్షం రోజుల వ్యవధిలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా ఏ ఎన్నికలు నిర్వహించినా, ఫలితాలు ప్రకటించకుండా కోడ్ కొనసాగిస్తూ, ఎన్నికలు ముగించాలని, గ్రామాల్లో ఘర్షణలకు ఆస్కారం లేకుండా చూడడంతో పాటు, పాలనాపర ఇబ్బందులను అధిగమించవచ్చనేది ప్రభుత్వ ఉన్నత స్థాయి వర్గాల ఆలోచనగా అధికారులు చెబుతున్నారు.

రిజర్వేషన్ల కోసం ఆశావహుల ఎదురుచూపులు

స్థానిక సంస్థలకు 2019లో జరిగిన ఎన్నికల్లో ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 15శాతం, బీసీలకు 25శాతం, మహిళలకు అన్ని కేటగిరీల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించారు. జడ్పీటీసీ స్థానాలకు, ఎంపీపీ పదవులకు పంచాయతీరాజ్ కమిషనర్ స్థాయిలో జిల్లాల వారీగా కోటాను ఖరారు చేస్తే, జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో ఆ కోటా ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా సీట్లను కేటాయించారు. ఎంపీటీసీ స్థానాలకు, సర్పంచ్ పదవులకు కలెక్టర్ల స్థాయిలో మండలాల వారీగా కోటా ఖరారు చేసి, ఆర్డీవోల నేతృత్వంలో ఆయా మండలాల్లో సీట్లను కేటాయించారు. ఈసారి రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఎలాంటి తుది నిర్ణయం తీసుకున్నా మొత్తం రిజర్వేషన్ల కోటా 50శాతానికి మించకుండా నిబంధనలు రూపొందిస్తారని, ఆమేరకు కోటా ఖరారు, సీట్ల కేటాయింపు గతం మాదిరిగానే చేపడతారా? లేక కోటా ఖరారు, కేటాయింపులపై మార్పులు, చేర్పులు తీసుకుంటారా? అనే విషయం తేలాల్సి ఉంది. ఈ వారంలోనే అన్ని అంశాలపై స్పష్టత వస్తుందని, వారంలోపే రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ, అధికారవర్గాల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే గ్రామాల్లో, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీ సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేషన్లు వారికి అనుకూలంగా వస్తే కదనరంగంలోకి దూకేందుకు అన్ని రకాలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సత్తా చాటాలి

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాలని సూచించారు. పార్టీ నిర్ణయం మేరకు అన్ని వర్గాలకు, పార్టీలోని విధేయులకు ప్రాధాన్యం కల్పించనున్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న వారి వివరాలు ఏఐసీసీ పరిశీలిస్తుందని, జిల్లాలో అత్యధికస్థానాలు గెలిపించిన నేతల వివరాలు సేకరించి, వారికి భవిష్యత్‌లో ఎలాంటి గుర్తింపు ఇవ్వాలనేది కూడా పరిశీలించనున్నట్లు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ ప్రకటించారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నామినేటెడ్ పదవులకు పేర్లు

రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులకు అర్హులైన నేతల పేర్లను కూడా ఈ నెల 17లోగా అందించాలని పార్టీ సీనియర్ నేతలకు ఏఐసీసీ సూచించింది. ఇటీవల నిర్వహించిన సమావేశంలో టీపీసీసీ కార్యవర్గంలో స్థానం దక్కని వారికి రానున్న రోజుల్లో అవకాశం కల్పిస్తామని, పదవుల భర్తీలోనూ సమన్యాయం పాటిస్తామని అగ్ర నాయకులు ప్రకటించారు. జిల్లాల్లో పార్టీ కోసం కష్టపడుతూ, నామినేటెడ్ పదవులకు అర్హులైన పేర్ల జాబితాను గాంధీభవన్‌లో అందించాలని డీసీసీ అధ్యక్షులకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సూచించారు. అయితే జిల్లాలోని పలువురు సీనియర్ల పేర్లను పార్టీ అధిష్ఠానికి మంగళవారం అందించేందుకు కసరత్తు పూర్తయింది.

నేడు విద్యుత్ సరాఫరాకు అంతరాయం

నల్లగొండ టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు రాంనగర్ ఫీడర్ పరిధిలోని గవర్నమెంట్ హాస్పిటల్, మిర్యాలగూడ రోడ్డు, దారుషాఫా కాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని కలెక్టర్‌కు ఫిర్యాదు

తిప్పర్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అర్హులను పక్కనపెట్టి అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని మండల పరిధిలోని సర్వారం గ్రామస్థులు కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఫిర్యాదు చేశారు. సోమవారం వారు ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిశారు. అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్నవారికే ఇచ్చారని ఆరోపించా రు. తమకు మంజూరు చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బొల్లం శంకర్, సిరబోయిన సైదులు, బొల్లం మల్లేష్, ఏశబోయిన పాపయ్య, వెంకన్న, మారయ్య పాల్గొన్నారు.

సమాచారం

వెంకటయ్యకు డాక్టరేట్



నాంపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బాణాల వెంకటయ్యకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. కస్టమర్స్ సాటిస్ఫాక్షన్ టూ వర్డ్స్ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు ఈ మార్కెటింగ్ పోర్టల్స్ ఇన్ ట్విన్ సిటీస్ ఆఫ్ హైదరాబాద్ అండ్ సికింద్రాబాద్ అనే అంశంపై చేసిన పరిశోధనకు వెంకటయ్యకు డాక్టరేట్ అందజేశారు. బాణాల ఉపేంద్రమ్మయాదయ్యల దంపతులకు పెద్ద కుమారుడు వెంకటయ్య. చిన్నతనంలోనే పోలియో సోకడంతో దివ్యాంగుడయ్యాడు. బాల్యం నుంచి చదువులో రాణిస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంకాం, పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలంగాణ సెట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అర్హత సాధించాడు. దివ్యాంగుల హక్కుల సాధనలోబాణాల వెంకటయ్య తన వంతు పాత్ర పోషించాడు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

గట్టుప్పల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. సోమవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు ఇవ్వకుండా, అనర్హులను ఎంపిక చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకే కేటాయిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గట్టుప్పల్ మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, మండల కమిటీ సభ్యుడు కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, ఖమ్మం రాములు, అచ్చిన శ్రీనివాస్, ఎండీ రబ్బాని, పెద్దగాని నరసింహారావు, నరసింహ, తెలుసూరి సైదులు, ముసుకు బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

డిప్యూటీ సీఎం, మంత్రిని కలిసిన రైతులు

కనగల్, జూన్ 16:(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో కనగల్ మండల రైతు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ హాఫీజుద్దీన్ కేసాని వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నాం ఆదుకోండి



ప్రజావాణిలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ఆదుకోండి అంటూ జిల్లా నలుమూలల నుంచి అనేకమంది బాధితులు ఎన్నో ప్రయాసలకోర్చి వారం వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. వారిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై రాక రాగా మరికొందరు సామాజిక అంశాలపై తరలివచ్చి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి తమ బాధలను విన్నవించారు. కలెక్టర్ వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించి వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. కాగా ఈ వారం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 78 వరకు దరఖాస్తులు వచ్చాయి.

బిల్లు ఇప్పించండి



చండూరు మున్సిపాలిటీ పరిధిలో 2022-23 సంవత్సరంలో డీఎంఎఫ్(టీ) నిధుల ద్వారా రూ. 10 లక్షలతో మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాను. ఇందుకు సంబంధించి కొన్ని రోజులుగా బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఇటీవల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కకలవగా ఎండార్స్‌మెంట్ చేశారు. అయితే పనిచేసిన మొత్తం రూ.10లక్షలకు కేవలం రూ. 5లక్షలు రూపాయలు మాత్రమే మంజూరయ్యాయి. మిగతా రూ.5 లక్షల రూపాయలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. దయచేసి బిల్లు ఇప్పించండి.

- రమేష్, చండూరు

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి



ఇటీవల మా గ్రామానికి 40 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయి. ఇందులో అర్హులైన వారు తక్కువగా ఉన్నారు. క్షేత్రస్థాయిలో జరిపిన సర్వే ప్రకారం అర్హులకు కాకుండా అనర్హులకు మాత్రమే కేటాయించారు. పదేళ్లుగా తామంతా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాం. అన్ని విధాలుగా అర్హులైన తమకు ఇల్లును మంజూరు చేసి ఆదుకోవాలి.

- కేతేపల్లి

ఆర్థికసాయం అందించండి



మేము నిరుపేద కుటుంబానికి చెందిన వాళ్లం. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె హర్షితకు ఇటీవల మెదడులో క్యాన్సర్ రావడంతో ఆస్తులన్నింటినీ అమ్ముకొని సుమారు రూ.16 లక్షలు అప్పు చేసి చికిత్స చేయించాం. ప్రస్తుతం మాపాపకు జబ్బు తగ్గినా నెలనెలా మందులకు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇప్పటికే తెచ్చిన అప్పులకు సంబంధించిన వడ్డీలు పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దయచేసి తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలి.

- టి. పూజిత, దోమలపెల్లి, నల్లగొండ

పీఎఫ్ అకౌంట్‌ను సరి చేయాలి



నేను నల్లగొండ మునిసిపాలిటీలో పారిశుధ్య విభాగంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. నా వేతనం నుంచి ప్రతీ నెలా పీఎఫ్ డబ్బులు కట్ అవుతున్నా నా పీఎఫ్ ఖాతాలో జమ కావడం లేదు. ఈ విషయమై స్థానిక మునిసిపాలిటీలో విచారించగా తన పీఎఫ్ ఖాతాకు మరో వ్యక్తి పేరిట ఉన్న ఆధార్ కార్డు లింక్ అయినట్లు చెబుతున్నారు. పీఎఫ్ కార్యాలయ సిబ్బంది కూడా దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. దయచేసి. పీఎఫ్ ఖాతాను సరిచేసి న్యాయం చేయాలి.

- జక్కల నరసింహ, నల్లగొండ

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

నాంపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి మంజూరై 19మంది లబ్ధిదారులకు రూ.6,63లక్షల విలువైన చెక్కులను అందజేసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, నాంపల్లి మండల కాంగ్రెస్ నాయకుడు పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొండేటి రాములు, దుర్గయ్య, మలిగిరెడ్డి చంద్రారెడ్డి, కొండల్ యాదవ్, వీరమల్ల సందీప్, సుధాకర్‌రెడ్డి, కాటం శ్రీను, ఈదయ్య, గాదెపాక రాజు, సబ్బి అరుణ, యాదమ్మ పాల్గొన్నారు.

హనుమంతరావును కలిసిన కాంగ్రెస్ నాయకులు

శాలిగౌరారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పీసీసీ మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.హనుమంతరావును దండ అశోక్‌రెడ్డి, బీసీ సంఘం నాయకుడు నోముల రవికుమార్‌లు కలసిసన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

సాగులో మెళకువలను అందించడానికే 'రైతునేస్తం'



చందుపట్లలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కనగల్, నకిరేకల్, కేతేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగులో ఆధునిక సాగు పద్ధతులను తెలియజేయడం కోసమే ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని అమలుచేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిన్నమాదారం, పగిడిమర్రి, రైతు వేదికల్లో సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అందించే సలహాలు, సూచనలను రైతులు పాటించి అధిక దిగుబడులను సాధించాలన్నారు. సాగు పెట్టుబడుల నిమిత్తం నేటి నుంచి వారం రోజుల పాటు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం జమ చేస్తుందని వివరించారు. మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి సుబ్బారావు, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, ఎంపీవో సుమలత, ఏవో అమరేందర్‌గౌడ్ మాజీ సర్పంచులు పోచమళ్ల లింగయ్యగౌడ్, గోలి నర్సిరెడ్డి, బోగరి రాంబాబు, మెరుగు శివయ్య, యాదయ్య, ముత్తయ్య, ఏఈఓలు నవీన్, అభిలాష్‌రెడ్డి, విజయలక్ష్మి, కీర్తన పాల్గొన్నారు.

రైతులకే మేలు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.నకిరేకల్ పట్టణం, మండలంలోని చందుపట్ల, టేకులగూడెం గ్రామాల్లో సోమవారం జరిగిన రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో పాటు ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీరుద్దీన్, నాయకులు సిలివేరు ప్రభాకర్, లింగాల వెంకన్న, నకిరేకంటి నరేందర్, మాద యల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సలహాలు, సూచనలు పాటించాలి

ఆధునిక పంటల సాగు, పంటల యాజమాన్యం తదితర అంశాలపై ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే సూచనలు, సలహాలు పాటించాలని నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కేతేపల్లి, ఇప్పలగూడెం క్లస్టర్ కేంద్రాల్లోని రైతువేదికల్లో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో వారు వేర్వేరుగా పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు పక్షపాతిగా పని చేస్తుందన్నారు. యాసంగిలో రైతులు పండించిన ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడమేగాక సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500బోనస్ చెల్లించిందన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందిస్తుందని తెలిపారు. పంటల సాగులో శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు పాటించి ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించి రైతులు అధిక దిగుబడులు పొందాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి హరీష్, తహసీల్దార్ సత్తార్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏవో బి.పురుషోత్తం, మార్కెట్ డైరెక్టర్‌లు ఎస్‌కె.లతీఫ్, బయ్యు ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాస యాదవ్, నాయకులు బొజ్జ సుందర్, మట్టి సాల్మన్, గుత్తా మాధవరెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస్, జె.వెంకటనర్సయ్యయాదవ్, ఏఈవోలు నాగరాజు, బాలరాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాంపల్లి చంద్రమౌళి

నాంపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నాంపల్లిలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాంపల్లి పాత తాలూకాలో మర్రిగూడెం, గుర్రంపోడు, చింతపల్లి, మండలాలతో ఉన్నవారికి నాంపల్లికి మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేస్తే కక్షిదారులకు దూరప్రాంతాలకు వెళ్లకుండా ఉంటుందని అన్నారు. అంతేకాక కోర్టు ఏర్పాటు చేస్తే వారికి సత్వర పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ ప్రాంతాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న భూమి తగాదాలు ఇతర పంచాయితీ కేసులు పరిష్కారమైతే భూమి సాగిలోకి వస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు కొమ్ము లక్ష్మయ్య, గడ్డం ఎల్లేష్, యాదయ్య, వెంకటయ్య, సైదులు పాల్గొన్నారు.

పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలి



ఆర్డీవో అశోక్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న బాధితులు

నార్కట్‌పల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అసైన్డ్ కింద అందజేసిన సీలింగ్ భూముల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బాధిత లబ్ధిదారులు సీపీఎం ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 399,411,414,415,425,426,444లలోని సుమారు 69 ఎకరాల సీలింగ్ భూమిని బడుగు, బలహీన వర్గాలకు చెందిన తమకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసైన్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పట్టా చేసినట్లు తెలిపారు. 2008లో రాజీవ్ స్వగృహ ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం భూ సేకరించగా నష్టపరిహారం విషయంలో అన్యాయం చేయడంతో తాము కోర్టును ఆశ్రయించామని తెలిపారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులోనే ఉందని లబ్ధిదారులందరమూ ఆ భూమిని సేద్యం చేస్తున్నామని తెలిపారు. కానీ పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వం వద్దే ఉండటంతో ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా, రైతు బీమా వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొందరు అధికార పార్టీ నాయకులు మాత్రం భూముల విషయంలో కోర్టులో రాజీపడేలా చేసి రియల్ ఎస్టేట్ భూములుగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి శంకర్, గాదె నర్సింహ, దండు రవి, నాగరాజు, శ్రీను, శంకర్, అంతటి సత్యనారాయణ, మాదగోని సైదులు, వాడపల్లి నవీన్, గంధం లింగయ్య, ఎల్లమ్మ, శంకర్, సత్తయ్య, శంకర్, లింగయ్య, వెంకన్న, లింగయ్య, రమేష్ పాల్గొన్నారు.

నిరుపేదల కల ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సాకారం



ఇప్పర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బూడిద లింగయ్య యాదవ్, ఎంపీడీవో విజయభాస్కర్

మర్రిగూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కల ఇందిరమ్మ పథకం ద్వారానే సాకారమైందని మాజీ ఎంపీటీసీ వరప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని కుదాభక్షపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ప్రొసీడింగ్ ఇచ్చిన నిరుపేద లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ముగ్గు పోసి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాతంగి నవీన్, యాదయ్య, రాములు, ఎల్లయ్య, మల్లయ్య, పలువురు మహిళలు ఉన్నారు.

మునుగోడు రూరల్ : ప్రతీ పేదవాడి ఇంటికల నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ ఓబీసీ జిల్లా కార్యదర్శి బూడిద లింగయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని ఇప్పర్తి గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్, హౌసింగ్ ఏఈ అనిల్, గ్రామ పంచాయతీ సెక్రటరీ లింగస్వామి, బొజ్జ మల్లయ్య, చీమల రాజు యాదవ్, ఆవుల శ్రీనివాస్ యాదవ్ , గాదే పరశురాములు ,ఆవుల సంపత్, ఎర్రగోని లింగయ్య యాదవ్, బూడిద నరసింహ, మేకల శ్రీనివాస్, మద్దిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలి

● సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, మొహమ్మద్ అబ్బాస్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మొహమ్మద్ అబ్బాస్

నల్లగొండరూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, మొహమ్మద్ అబ్బాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం నల్లగొండ నియోజక వర్గ స్థాయి రాజకీయ శిక్షణా తరగతుతులు స్థానిక పెద్దబండలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాల్‌లో రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించడంతో కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. విద్యుత్ సంస్కరణల చట్టం రద్దు చేయాలని, రాష్ట్రాలపై పెత్తనాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న ప్రధాన ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో గుర్తించి వెంటనే వాటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించి, చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్లో రైతులుకు అవసరమైన నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న చివరి భూముల వరకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పెండింగులో ఉన్న రైతుబంధు రూ.రెండు లక్షల లోపు అందరికీ రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, ప్రభావతి,జిల్లా కమిటీ సభ్యులు ఎండీ.సలీం, కొండ అనురాధ, మండల కార్యదర్శులు నలప రాజు సైదులు, మన్నెం బిక్షం, కానుగు లింగస్వామి, పులెంల శ్రీకర్, తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, కొండ వెంకన్న, గండమల్ల రాములు, కుంభం కృష్ణారెడ్డి, సుల్తానబేగం, లింగయ్య, సాజిద్, రవీందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం: సీడీపీవో



ఎస్సీ కాలనీలో అమ్మమాట -అంగన్‌వాడీ బాట ప్రచారం చేస్తున్న అధికారులు

నల్లగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల లోని చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించనున్నట్లు సీడీపీవో హరిత అన్నారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అమ్మ మాట -బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే విధంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ కె.శ్రీదేవి, సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కనగల్: కనగల్ అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు చిన్నారులకు ఎంపీవో సుమలత అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సూపర్‌వైజర్ యశోద అన్నారు. మండలంలోని ఖుదాభక్షపల్లి, ఎర్రగొండపల్లి గ్రామాల్లో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

మునుగోడు రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలల్లో 30 నెలలు నిండిన చిన్నారులను చేర్పించాలి. పలివెల అంగన్‌వాడీ టీచర్‌లు గోస్కొండ ప్రమీల, పుష్పలత, అరుణ పేర్కొన్నారు. మండలంలోని పులిపలుపుల నిర్వహించిన కార్యక్రమంలో పుష్పలత, ప్రమీల, అరుణ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

నకిరేకల్, జూన్ 16, (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్‌చేశారు. నకిరేకల్‌లోని ఎన్ ఆర్ భవన్‌లో సోమవారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ మండల కార్యదర్శి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 541 మంది మావోయిస్టులు, ఆదివాసీలను కాల్చి చంపిందని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో 17 నెలలుగా కేంద్ర బలగాలతో మావోయిస్టులు, ఆదివాసీలపై విచక్షణ రహితంగా కాల్పులు జరుపుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వం నరమేదం సృష్టిస్తూ, విదేశీ బహుళ జాతి కార్పోరేట్ సంస్థలకు అటవీ సంపదను అప్పజెప్పేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాళ ప్రమీళ, జిల్లా కమిటీ సభ్యులు రాచకొండ వెంకట్ గౌడ్, బొజ్జ చిన్నవెంకులు, అవిశెట్టి శంకరయ్య, పింజర్ల సైదులు, జిట్టా సరోజ, నకిరేకల్, కేతేపల్లి పట్టణ కార్యదర్శులు వంటెపాక వెంకటేశ్వర్లు, చింతపల్లి లూర్దు మారయ్య తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బొమ్మకంటి గౌరవయ్య, నాయకులు వల్లాల సైదులు, ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక నాయకుడు పల్స యాదగిరి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ జమీరొద్దిన్‌కు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో నాయకులు జి. సైదులు, బెల్లి నాగరాజు, పల్లెబోయిన జాని, బంటు రామలింగయ్య, భద్రయ్య, యానాల లింగారెడ్డి, మంగమ్మ పాల్గొన్నారు.

మూసీ రోడ్డుకు మోక్షమెప్పుడో?

(5వ పేజీ తరువాయి)

అక్కడికి వెళ్లే సందర్శకులు, ప్రాజెక్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది, అధికారుల బాధలు వర్ణనాతీతం.

శంకుస్థాపనే.. పనులు ప్రారంభం కాలే

కేతేపల్లి శివారు 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి కాసనగోడు వరకు గల 10కిలో మీటర్ల వరకు రోడ్డు గుంతలతో నిండిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం ఎంఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.1.17 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే 2023 ఆగస్టులో శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు. ప్రభుత్వం మారినా ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు గుండా ప్రయాణించే కొత్తపేట, గుడివాడ, బొప్పారం, కాసనగోడు గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు.

మరమ్మతులు పూర్తి చేయాలి



మూసీ రోడ్డుకు ఏళ్ల తరబడి మరమ్మతులు లేకుండా పోయాయి. రహదారి గుంతలతో నిం డిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మూసీ రోడ్డు మరమ్మతులకు అవసరమైన నిధులను కేటాయించి సత్వరం పనులు పూర్తి చేయాలి.


- రాచకొండ సైదులు, కొత్తపేట

త్వరలో రోడ్ల పనులు ప్రారంభమవుతాయి

మూసీ రోడ్డు పనులు తొందర్లో ప్రారంభమవుతాయి. పనుల టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనుల పూర్తికి గడువు పొడిగించాలని అధికారులను కోరుతున్నారు. పనులను ప్రారంభించి నిర్వహణను వేగవంతం చేయాలని సూచిస్తున్నాం. తొందర్లోనే పనులు ప్రారంభమవుతాయి. ఎన్‌హెచ్65 కాసనగోడు రోడ్డు పనుల కాంట్రాక్టర్ జంగిల్ కటింగ్ పనులు నిర్వహించారు. మిగిలిన పనులు కూడ సత్వరమే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.


- సంపత్‌కుమార్ పీఆర్ ఏఈ

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 17 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.5
కనిష్ఠం	24.8

తక్కువ ధరకే బంగారం
ఇస్తామని మోసం
● ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
6



స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రాజకీయవర్గాల్లో ఒక్కసారిగా సందడి మొదలైంది. బీసీ రిజర్వేషన్ల విషయాన్ని ప్రభుత్వం తేల్చితే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏ సమయంలోనైనా షెడ్యూల్ విడుదలచేసే అవకాశం ఉండటంతో అధికారులు సైతం సిద్ధంగా ఉన్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

స్థానికంపై .. ముందుకు!

- రిజర్వేషన్ల కోటాపై ప్రభుత్వ విధాన నిర్ణయం పెండింగ్
- రిజర్వేషన్ల అనంతరం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్న నాయకులు
- పరిషత్, పంచాయతీ ఎన్నికలకు వారంలో షెడ్యూల్ వస్తుందని చర్చ


గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు పాలకవర్గాల గడువు ముగిశాక సకాలంలో ఎన్నికలు నిర్వహించలేకపోవడంతో ప్రస్తుతం అవన్నీ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, వాటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం జతచేయాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో పల్లెలు, పట్టణాల్లో ఎక్కడి పనులక్కడే నిలిచిపోవడంతోపాటు పాలన గాడితప్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో దాన్ని తక్షణం అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంఘాలు, ప్రతిపక్ష బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. దీంతో ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. వార్డు మొదలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం వరకు ఏ స్థానం, ఏ కేటగిరీకి కేటాయిస్తారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అధికారిక రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండడానికి ఆస్కారం లేకపోవడంతో, తాజా కులగణన నివేదిక ప్రకారం రిజర్వేషన్ల అమలులో భాగంగా బీసీలకు తమ పార్టీ నుంచి 42శాతం సీట్లు కేటాయిస్తామని, జనరల్ స్థానాల్లో బీసీలకు ప్రాధాన్యం పెంచుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయి నాయకుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

ఎప్పుడైనా షెడ్యూల్ వచ్చే అంచనాలో అధికార యంత్రాంగం

పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న సంకేతాలతో అధికారయంత్రాంగం, పోటీ చేయాలనుకునే ఆశావహులు అప్రమత్తమయ్యారు. ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత కలుపుకొని మొత్తం 73 మండలాల్లో 73 జడ్పీటీసీ స్థానాలు, 1,730 గ్రామపంచాయతీలు, సుమారు 17,500కుపైగా వార్డు స్థానాలు, 722 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పోలింగ్, పోలీస్..

- మిగతా 7వ పేజీలో...

సత్తా చాటాలి



- వ్యూహాలు రచిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం
- స్థానిక ఎన్నికల్లో మండల, జిల్లా కమిటీలదే కీలక పాత్ర
- నెలాఖరులోగా కమిటీల నియామకానికి కసరత్తు
- క్షేత్రస్థాయిలో కష్టపడేవారికే ప్రాధాన్యం

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండగా, ప్రధాన రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని సన్నద్ధమవుతున్నాయి. ప్రధానంగా అధికార పార్టీ కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుండటంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ఏఐసీసీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. ఏఐసీసీ పెద్దలు, మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యేలు, పార్టీలోని సీనియర్ నేతలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. పార్టీపరంగా ఎక్కడా నేతల మధ్య సమన్వయంలోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధిష్ఠానం ఇప్పటికే టీపీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించి, జిల్లాల్లోని సీనియర్ నేతలకు అందులో అవకాశం కల్పించింది. పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు రాష్ట్ర, జిల్లా, మండల నేతలంతా కృషి చేయాలని సూచించింది. అందుకు వీలైనంతా త్వరగా మండల కమిటీల ఏర్పాటు పూర్తిచేయాలని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ నాయకులకు సూచించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో మండల, జిల్లా కమిటీలే కీలక పాత్ర పోషిస్తాయ ని, నెలాఖరు నాటికి మండల అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. మండల అధ్యక్షుల పదవులకు ఈనెల 17వరకు నేతల పేర్లు సేకరించి, ప్రతి మండలం నుంచి ఐదుగురితో కూడిన జాబితా అందజేయాలని డీసీసీ అధ్యక్షులను కోరారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులతో మీనాక్షి నటరాజన్‌జూమ్ మీటింగ్ సైతం నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిపై చర్చించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న మండల నేతల జాబితాలు అందజేయాలని డీసీసీ అధ్యక్షులకు సూచించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు మంగళవారం ఉమ్మడి జిల్లా నుంచి మండల అధ్యక్షుల ఎన్నికకు ప్రతిపాదిత జాబితాలు పంపేందుకు నాయకులు కసరత్తు పూర్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేలతో చర్చించి, అర్హులైన వారి జాబితాలు సిద్ధం చేశారు.

కష్టపడేవారికే అవకాశం...

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ సారి ఎవరికి పడితే వారికి సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యం ఇస్తామని ఏఐసీసీ స్పష్టం చేసింది. పార్టీని నమ్ముకుని, స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నవారికే సర్పంచ్, వార్డు సభ్యులు, ఎం పీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ కౌన్సిలర్లుగా అవకాశం కల్పిస్తామని ప్రకటించింది. మరోవైపు ఏఐసీసీ పెద్దలు స్థానిక సంస్థల..

- మిగతా 7వ పేజీలో...

రైతు భరోసా షురూ

- సోమవారం సాయంత్రం నుంచే జమ
- నల్లగొండ జిల్లాకు రైతుభరోసా నిధులు రూ.411కోట్లు
- రెండో విడతలో రూ.327కోట్లకు పైగా జమచేయనున్న ప్రభుత్వం
- సాగు చేసే భూమి అంతటికీ పెట్టుబడి సాయం



నల్లగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా నిధులను విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలో మొదటి విడతగా సోమవారం సాయంత్రం 4,36,994 మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు రూ.411,34,37,747 విడుదల చేసింది. ఈ నిధులు సోమవారం సాయంత్రం నుంచే జమకావడం ప్రారంభమైందని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తం 5,65,803 మంది రైతుల...

- మిగతా 6వ పేజీలో...

మూసీ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- శంకుస్థాపన చేసి రెండేళ్లు
- ఇప్పటికీ ప్రారంభంకాని పనులు
- సందర్శకులు, ప్రాజెక్టు సిబ్బందికి తప్పని ఇబ్బందులు



బొప్పారం శివారులో మూసీ కుడి కాల్వ కట్టపై గుంతలమయమైన రహదారి

కేతేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, సూర్యాపేట జిల్లా సరిహద్దుల్లో గల మూసీ ప్రాజెక్టు వద్దకు వెళ్లే కేతేపల్లి ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. ఈ రహదారి ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. మూసీ ప్రాజెక్టును సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు, పరిసర గ్రామాల ప్రజలు, మూసీ ప్రాజెక్టు దిగువన ఉన్న బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేతేపల్లిలోని 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి మూసీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ వెంట కొత్తపేట, కాసనగోడు, బొప్పారం గ్రామాల మీదుగా ప్రాజెక్టు వరకు గల 13కిలో మీటర్ల రహదారి మట్టిరోడ్డుగా ఉండేది. వర్షాకాలంలో నడవడానికి కూడా వీలులేకుండా ఉండేది. దశాబ్దం క్రితం కేతేపల్లిలోని 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి కాసనగోడు గ్రామ శివారు వరకు సుమారు 10కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి మూసీ ప్రాజెక్టు వరకు మరో మూడు కిలో మీటర్లకు పైగా రోడ్డును అలాగే వదిలేశారు. ఇప్పటి వరకు ఆ రోడ్డు మరమ్మతులకు నోచడం లేదు. కేతేపల్లి నుంచి కాసనగోడు గ్రామ శివారు వరకు దశాబ్దకాలం క్రితం నిర్మించిన బీటీ రోడ్డు కూడా ధ్వంసమైంది. అంతంతమాత్రంగా ఉన్న ఈ రహదారిపై మూసీ కుడి ప్రధాన కాల్వ పనుల నిర్వహణలో భాగంగా మూడేళ్ల క్రితం తిరిగిన యంత్రాలు, వాహనాల ధాటికి రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయమైంది.

కాల్వ కట్టే రోడ్డు

కాసనగోడు గ్రామం నుంచి మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డు లేకపోవడంతో మూసీ కుడి ప్రధాన కాల్వ కట్టపై నుంచే ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. కాసనగోడు, బొప్పారం గ్రామాలకు చెందిన రైతులు మూసీ ప్రాజెక్టు సమీపంలోని వ్యవసాయ భూములకు వెళ్లాలంటే ఈ కట్టపై నుంచే వెళ్లాలి. ధాన్యాన్ని ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇళ్లకు తరలించేందుకు ఈ గుంతల దారితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరదలు వచ్చి మూసీ ప్రాజెక్టు పొంగిపొర్లే సమయంలో మండల కేంద్రం కేతేపల్లి నుంచి

- మిగతా 8వ పేజీలో...

రైతుల భవిష్యత్తు దిశగా 'రైతు నేస్తం'



చింతపల్లి మండలం నెల్వలపల్లిలో మహిళా రైతుతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతుల భవిష్యత్తు దిశగా రైతునేస్తం కార్యక్రమం ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'రైతునేస్తం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.

నసర్లపల్లి గ్రామ మహిళా రైతుతో మాట్లాడిన సీఎం..

మండలంలోని నసర్లపల్లి గ్రామ మహిళా రైతు బిక్కని రాణిమ్మ సీఎం రేవంత్‌రెడ్డితో ముఖాముఖి మాట్లాడింది. నాలుగు ఎకరాల పొలం ఉందని సన్న వడ్లు వేశామని ఎనిమిది పుట్లు పండిందని ముఖ్యమంత్రితో సంభాషించారు. ప్రభుత్వం నుంచి రూ.1,80,000 రుణ మాఫీతో పాటు బోనస్ కింద రూ.15,000 జమ అయ్యాయని,దీంతో పాటు ప్రభుత్వం రూ.17100 రైతు భరోసా మంజూరు చేసిందని ఆమె తెలిపారు. తనకు ఇద్దరు అమ్మాయిలు ఒకరు 10 తరగతి, మరొకరు ఇంటర్‌మీడియట్ చదువుతున్నట్లు ఆమ చెప్పడంతో వారి ఉన్నత చదువుల కోసం కృషిచేసి బంగారు భవిష్యత్తు కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమాణారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, ఏవో శ్రవణికుమారి, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, మాల్ మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలుసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవానిపవన్‌కుమార్ ఉన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: 'ప్రజావాణి' దరఖాస్తులు పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 'ప్రజావాణి'లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మాత్రమే కాకుండా, గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆయా, ఆశ వర్కర్ల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహార పంపిణీ, గర్భిణులకు నిరంతర పరీక్షలు, చికిత్స , తదితర అంశాలను చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. త్వరలోనే రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష నిర్వహించనున్నందున సంబంధిత అధికారులు సమాచారంతో సమీక్షకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో 2024 సంవత్సరంలో విడతల వారీగా రుణమాఫీ పొందిన రైతుల వివరాలను ఆయా గ్రామపంచాయతీల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నల్లగొండ కల్చరల్: జిల్లాకేంద్రంలో ఈనెల 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాల'ని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, పతంజలి యోగా సమితి అధ్యక్షుడు నాగులపల్లి శ్యాంసుందర్, యోగా గురువులు కరుణాకర్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి కృషిచేయాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసు కున్నారు. పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. వారి నుంచి వినతులు స్వీకరించి సంబంధిత క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ప్రథమంలో బాలికలు, ద్వితీయంలో బాలుర పైచేయి

నల్లగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో బాలికలు, ద్వితీయ సంవత్సరంలో బాలురు పైచేయి సాధించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదలచేసింది. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 7,617మంది విద్యార్థులకు 5,196మంది (68.22శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు 3,728మందికి 2,347మంది(62.96శాతం) ఉత్తీర్ణత సాధించగా, బాలికల విభాగంలో 3,889 మందికి 2,849మంది(73.26శాతం) ఉత్తీరులయ్యారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 925మందికి 641మంది(69.3శాతం) ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 635మందికి 420మంది (66.14శాతం) ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 290మందికి 221మంది (76.21శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో మొత్తం 3,771మందికి 2,537మంది(67.28 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 2,207మందికి 1,495మంది (67.74) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 1,564మందికి 1,042మంది (66.62శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో ద్వితీయ సంవత్సరంలో 657మందికి 402మంది (61.19శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు 529మందికి 330మంది(62.38శాతం) ఉత్తీర్ణులు కాగా, బాలికలు 128మందికి గాను 72మంది (56.25శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఇంటి కోసం మహిళ ఒంటరి పోరాటం

త్రిపురారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తనకు ఇందిరమ్మ ఇంటిని ఇవ్వకపోతే కదిలేది లేదని పంచాయతీ కార్యాలయం ఎదుట ఓ మహిళ భీష్మించుకుకూర్చుంది. సోమవారం రాత్రి త్రిపురారం మండలం కంపసాగర్ ఆవాస పరిధిలోని కోమటిగూడెంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... కోమటిగూడెం గ్రామానికి చెందిన మాతంగి సైదమ్మకు నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టిన అనంతరం సుమారు 15 సంవత్సరాల క్రితం ఆమెను, పిల్లలను తల్లిగారింటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. సైదమ్మ కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. ఆమె ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకోగా, జాబితాలో పేరు కూడా వచ్చింది. చివరికి మంజూరు పత్రాలు రాలేదు. కంపసాగర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న సైదమ్మ పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా అప్పటికే అధికారులు వెళ్లిపోయారు. దీంతో ఆమె సాయంత్రం 5 గంటల పంచాయతీ కార్యాలయం ఎదుట నుంచి కదలనని భీష్మించుకు కూర్చుంది. రాత్రి 11 సమయంలోనూ అక్కడే నిద్రించింది.

డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

డీఐవో డాక్టర్ పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఐవో డాక్టర్ పద్మ

నల్లగొండ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ పద్మ అన్నారు. సోమవారం పానగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న పిల్లలలో డయేరియా సమస్య వచ్చే అవకాశాలు ఉందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలున్న ప్రతీ ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్, జింక్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు వీటి వినియోగంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా అంతటా ఈ కార్యక్రమం ఉంటుందని, వైద్యాధికారులు సిబ్బంది ఈ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ వినియోగం గురించి వివరించారు. ఒక ప్యాకెట్‌ను లీటర్ తాగునీటిలో కలిపి నీళ్ల విరేచనాలు ఉన్న పిల్లలకి తాగించాలని, కేవలం ఒక్కరోజు మాత్రమే తెరిచిన ప్యాకెట్‌ను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి డాక్టర్ జి.తిరుపతిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిల్ప, కృష్ణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి సర్వే

కొండమల్లేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో ప్రభుత్వ భూములను సోమవారం అధికారులు సర్వే చేశారు. పెండ్లిపాకల రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న రైతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం గుమ్మడవెల్లి గ్రామపంచాయతీలోని సర్వే నెం.86లోని ప్రభుత్వ భూమిని సర్వే చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ శ్రీను, ఎస్ఐ అజ్మీర రమేష్, సర్వేయర్ విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయంలో వేలం వాయిదా

దామరచర్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీబంగారు మైసమ్మ తల్లి ఆలయంలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, దున్నపోతుల సేకరణ, పూలదండలు, నిమ్మకాయలు, లడ్డూలు విక్రయించే హక్కు, కొబ్బరి చిప్పలు, తలనీలాలు సేకరించే హక్కులకై సోమవారం నిర్వహించాల్సిన వేలం వాయిదా వేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. తిరిగి ఈ నెల 24న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సమాచారం

ఎమ్మార్పీఎస్ గాజీనగర్ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజీనగర్ ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్యమాదిగ అధ్యక్షతన ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పేట రమేష్‌మాదిగ, ప్రధాన కార్యదర్శి పేట శ్రీనుమాదిగ, ఉపాధ్యక్షుడు ఆశపాక ఊషయ్యమాదిగ, సహాయ కార్యదర్శి పేట బాలకృష్ణ, కోశాధికారిగా పేట లక్ష్మయ్య, పేట చిన్న కృష్ణయ్యలను ఎన్నుకున్నారు. జూలై 7వ తేదీన జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేని యాదయ్య, గడ్డం శ్రీరాములుమాదిగ, ఇద్దయ్యమాదిగ, నాగ, గోపి, మహేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు కృషి

చింతపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గోవుల సంరక్షణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకొని తగిన కృషి చేస్తున్నట్లు సాయిబాబా ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య తెలిపారు. చింతపల్లి మండలం గోశాలలోని గోవులకు సోమవారం చర్మవ్యాధి నివారణకు పశువైద్యాధికారి పర్యవేక్షణలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి దేవతల స్వరూపం గోమాత అని, హిందువులందరూ గోవులను దర్శనం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలు తొలగిపోవాలంటే చింతపల్లిలోని సాయిసన్నిధిని దర్శించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి వూరె కృష్ణయ్య, గోశాల ఇన్‌చార్జి కుంభం షుల్లారెడ్డి, మండల పశువు వైద్యాధికారి భానుకిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

నేరేడుగొమ్ము, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని నేరేడుగొమ్ము తహసీల్దార్ ఉమాదేవి, మండల వ్యవసాయశాఖ అధికారి యాదగిరి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన రైతునేస్తం, రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పత్తి విత్తనాల కొరతలేదన్నారు. లైసెన్స్ కలిగిన ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, రశీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు వాణిజ్య పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూడళ్లలో కుళ్లుతున్న వ్యర్థాలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


సీతారాంపురం నుంచి ఎన్నెస్పీ క్యాంపునకు వెళ్లే కూడలిలో చెత్తకుప్పలు


హౌసింగ్‌బోర్డులో రహదారికిరువైపులా చెత్తకుప్పలు

(మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి) పురపాలకుల నిర్లక్ష్యంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వ్యర్థాలు కుళ్లుతున్నాయి. సీతారాంపురం, బంగారుగడ్డ, హౌజింగ్ బోర్డు, ముత్తిరెడ్డికుంట తదితర ప్రాంతాల్లో ఆయా కాలనీవాసుల ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థాలను చౌరస్తాలలో వేస్తున్నారు. అయితే పారిశుధ్య సిబ్బంది సకాలంలో వాటిని తరలించకపోవడంతో చెత్త, వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు రహదారులపై చెల్లాచెదురుగా పడుతున్నాయి.

వర్షాకాలం నేపథ్యంలో చెత్తకుప్పల నుంచి దుర్వాసన వెలువడుతోందని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మునిసిపల్ అధికారులు వేసిన చెత్తను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని, కాలనీల్లో చెత్త వేసేందుకు డంప్‌లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చెత్తను పారిశుధ్య సిబ్బందికి అందించాలి



ఇళ్లు, వ్యాపార సంస్థల నుంచి వెలువడే వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందికి అందించాలి. పలు కాలనీల్లో చెత్తను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలని, అనుదినం కాలనీలకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరుతున్నా కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలా కూడళ్లలో చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా విధిస్తాం.

- వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అంగన్‌వాడీలతో పాఠశాలకు సన్నద్ధం


వేములపల్లి: సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న తహసీల్దార్ హేమలత, సీడీపీవో చంద్రకళ

వేములపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్యార్థులు ఆటపాటలతో విద్యపై ఆసక్తి పెంచుకొని పాఠశాల విద్యకు సన్నద్ధమవుతారని తహసీల్దార్ హేమలత అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను వారి తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తే ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని పొందడంతో పాటు కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను పూర్తి చేసుకొని పాఠశాల విద్యకు వెళ్లేందుకు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు స్పందన, మహేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమి రజిని, టీచర్లు నిర్మల, శోభారాణి, బాలరాజు, విజయభాస్కర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, వెంకటేశ్వర్లు, కోటేష్, వెంకన్న, నాగిరెడ్డి, మధు, రమేష్, శ్రీకాంత్, పెదవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● హాలియా: అనుముల మండలం మారేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఉదయశ్రీ మాట్లాడుతూ మూడేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

● చింతపల్లి: మండలంలోని కుర్మేడ్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, టీచర్లు దురేష, వెంకటమ్మ, ఆయాలు మణెమ్మ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కేశవరావు ఆశయ సాధనకు కృషి


ప్రొఫెసర్ కేశవరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ కేశవరావు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు నారాయణరెడ్డి అన్నారు. ప్రొఫెసర్ కేశవరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వాన్ని, భావజాలాన్ని నలుదిక్కులా విస్తరింపజేశారన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరు బాట పట్టిన కేశవరావు, మానవ హక్కుల సాధన కోసం పోరాడారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో పయనించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కలిమెల నాగయ్య, డేగ వీటి, బీసం రామయ్య, బిక్షమయ్య, గురవయ్య, మనోజ్‌కుమార్, హరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


ర్యాలీలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమసంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేవరకొండ పట్టణంలో సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చలోబడి కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, బీసీ సంక్షేమసంఘం నాయకుడు వెంకటేష్, లక్ష్మణ్, ఖాదర్, బిక్షమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి


ఏఈకి వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

చింతపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని బీ జేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద హెచ్చరిక బోర్డులు లేక ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. బిల్లుల వసూళ్ల ఉన్న శ్రద్ధ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో లేదని అన్నారు. కార్యక్రమం లో బీజేపీ నాయకులు కుక్కడపు రామకృష్ణ, కార్యదర్శి కుంభం శ్రీనివాస్‌రెడ్డి, వెన్నం శేఖర్, బొడ్డు మహేష్, శ్రీను, శివకుమార్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలి



ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న బుడిగె వెంకటేష్

దేవరకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ డిమాండ్ చేశారు. దేవరకొండ పట్టణంలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ సంస్థ విదార్థుల బస్‌పాస్‌లను 20 శాతం పెంచడం వల్ల వల్ల పేద విద్యార్థులపై పెనుభారం పడుతుందన్నారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇద్దిరాములు, రాకేష్, చరణ్, అనూష, స్పందన, గీతాంజలి పాల్గొన్నారు.

ఇళ్లను వేగవంతంగా నిర్మించుకోవాలి



ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీవో డానియెల్

దేవరకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను నిబంధనల మేరకు లబ్ధిదారులు వేగవంతంగా నిర్ణీత కాలంలో నిర్మించుకోవాలని ఎంపీడీవో డానియెల్ అన్నారు. దేవరకొండ మండలం శేరిపల్లి పెద్దతండాలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పెద్దతండాలో 20 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులు హౌజింగ్ అధికారుల సూచనలు, నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకొని ఎప్పటికప్పుడు బిల్లులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మతుల్యానాయక్, పంచాయతీ కార్యదర్శులు శ్రీదేవి, శంకర్, మూర్తి, మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తిరుమలగిరి(సాగర్), జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అం దుతుందని ఎంఈవో కె.శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చెంచోనితండా పాఠశాలలో నిర్వహించిన చిన్నారుల సామూహిక అక్షరా భ్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల మూత పడే దశలో ఉన్న క్రమంలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల కు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఎంఈవో, హెచ్‌ఎం సహకారంతో పాఠశాల చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేయడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సుహాసిని, సీఆర్‌పీ రంగస్వామి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం కృషి


హాలియా: వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న నాయకులు, రైతులు

కొండమల్లేపల్లి, జూ న్ 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సం క్షేమం కో సం ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఆయన మాట్లాడారు. వానాకాలం పంటకు సంబంధించి రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. వానాకాలం పంటకు సంబంధించిన రైతు భరోసాను సాగు చేసే రైతన్నల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో జానకిరాములు, ఏఈవో మహేష్, సురేష్, రైతులు పాల్గొన్నారు.

● అనుముల మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు కొత్తపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ముఖాముఖిని వీక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, ఏవో సరిత, ఉద్యానశాఖ ఆఫీసర్ మురళి, తహసీల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలి

మిర్యాలగూడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలను వెంటనే మూసివేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యాధికారి బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో మండలాల పరిధిలో అనుమతులు లేకుండానే అనేక పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపించారు. టెక్నో, ఐఐటీ లాంటి రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయల ఫీజులను లాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలను, స్కూల్ యూనిఫామ్స్‌ను పాఠశాలల్లో విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి పర్మిషన్ లేని పాఠశాలలు, యూనిఫామ్స్, బుక్స్ విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్, నాయకులు రాగ్యా, కిరణ్, వెంకటేశ్, రఘు, మణి తదితరులు పాల్గొన్నారు.

మూసీ రోడ్డుకు మోక్షమెప్పుడో

(5వ పేజీ తరువాయి)


కొత్తపేట శివారులో ధ్వంసమైన మూసీ రోడ్డు

అక్కడికి వెళ్లే సందర్శకులు, ప్రాజెక్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది, అధికారుల బాధలు వర్ణణాతీతం.

శంకుస్థాపనే.. పనులు ప్రారంభం కాలే

కేతేపల్లి శివారు 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి కాసనగోడు వరకు గల 10కిలో మీటర్ల వరకు రోడ్డు గుంతలతో నిండిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం ఎంఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.1.17కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే 2023 ఆగస్టులో శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు. ప్రభుత్వం మారినా ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు గుండా ప్రయాణించే కొత్తపేట, గుడివాడ, బొప్పారం, కాసనగోడు గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు.

మరమ్మతులు పూర్తి చేయాలి



మూసీ రోడ్డుకు ఏళ్ల తరబడి మరమ్మతులు లేకుండా పోయాయి. రహదారి గుంతలతో నిండిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మూసీ రోడ్డు మరమ్మతులకు అవసరమైన నిధులను కేటాయించి సత్వరం పనులు పూర్తి చేయాలి.

- రాచకొండ సైదులు, కొత్తపేట

త్వరలో రోడ్ల పనులు ప్రారంభమవుతాయి

మూసీ రోడ్డు పనులు తొందర్లో ప్రారంభమవుతాయి. పనుల టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనుల పూర్తికి గడువు పొడిగించాలని అధికారులను కోరుతున్నారు. పనులను ప్రారంభించి నిర్వహణను వేగవంతం చేయాలని సూచిస్తున్నాం. తొందర్లోనే పనులు ప్రారంభమవుతాయి. ఎన్‌హెచ్65 కాసనగోడు రోడ్డు పనుల కాంట్రాక్టర్ జంగిల్ కటింగ్ పనులు నిర్వహించారు. మిగిలిన పనులు కూడ సత్వరమే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

- సంపత్‌కుమార్, పీఆర్ ఏఈ

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బషీర్

నాగార్జునసాగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న 11 జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ బషీర్ పిలుపునిచ్చారు. సాగర్ హిల్‌కాలనీలో సోమవారం నిర్వహించిన విలేకరుల స మావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కవచకుండల్లా ఉన్న 34 కార్మిక చట్టాలను తొలగించి దేశవ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని కేం ద్రప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ప్రతీ కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంతేకాకుండా మునిసిపాలిటీల్లో కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నందికొండ మునిసిపాలిటీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివ, ఉపాధ్యక్షులుగా నాగ, బాస్కర్, కార్యదర్శి తాహేర్, మహిళా ఉపాధ్యక్షురాలు బాల మ్మ, సహాయ కార్యదర్శులుగా వెంకట్‌రెడ్డి, మణి ఎన్నికయ్యారు.

భూములపై హక్కులు కల్పించాలి


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

డిండి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆధీనంలో ఉన్న నీటిపారుదలశాఖ భూములపై హక్కులు కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డిండి ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అప్పటి నిజాం ప్రభుత్వం 1942లో ప్రాజెక్టు అవసరాల కోసం రైతుల నుంచి భూసేకరణ చేపట్టింది. ప్రాజెక్టు అవసరాలకు పోను మిగిలిన భూమి సుమారు 400 ఎకరాలు నేటికి రైతులు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. 2009లో అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి రైతుల ఆధీనంలో ఉన్న భూములను నీటిపారుదలశాఖ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న భూములపై రైతులు హక్కులు కోల్పోయారు. రైతుల ఆధీనంలో ఉన్న భూములకు హక్కులు కల్పించాలని కోరారు. ఫ్లకార్డులతో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ముస్తఫాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు కాయితి శేఖర్‌రెడ్డి, ఐలేష్, నల్లగంతుల రవి, కామేపల్లి గెల్వయ్య, మూడావత్ కిషన్, బూషిపాక చంద్రయ్య, మాధవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంతువుల సంచారంతో జరిగే ప్రమాదాలను నివారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జంతువల వల్ల కలిగే వాహన ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు అన్నారు. మిర్యాలగూడలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహన ప్రమాద మరణాల్లో జంతువుల వల్ల జరిగే ప్రమాదాల్లో ప్రాణనష్టం సంభవిస్తుందని అన్నారు. బర్రెలు రాత్రిపూట తిగకుండా ఉంటే ప్రమాదాలకు గురికాకుండా ఉంటాయని, రైతుల వాటిని బయటకు రాకుండా చూడాలని అన్నారు. బర్రెల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అంటిస్తే మంచిదే కానీ అవి మట్టిలో, బురదలో పొర్లాడటం వల్ల స్టిక్కర్లు చెరిగిపోయే అవకాశం ఉందని అన్నారు. జంతు ప్రమాదాలపై ప్రభుత్వం ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రతీ బర్రెకు ట్యాగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆ ట్యాగ్‌ను ఎవరైనా స్కాన్ చేసుకునే విధంగా యాప్‌ను అందుబాటులోకి తేవాని సూచించారు. ఆ యాప్ ద్వారా బర్రెల యజమానులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సంబంధిత యజమానికి చలానా వేసి, జరిమానా విధించాలని సూచించారు. దీంతో మనుషుల, జంతువుల ప్రాణాలను కాపాడిన వారమవుతామని పేర్కొన్నారు. సమావేశంలో సాయి, వెంకన్న, బాస్కర్ పాల్గొన్నారు.